నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 2-3-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 159 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

అప్పులకుప్ప
చుక్కానిలేని నావ
గెంతని కప్ప.

పల్లెల బాట
ఆనందాల పూతోట
మార్పు సహజం.

కుమ్మరి చక్రం
మట్టి కళాఖండాలు
చేతికి మట్టి

గజగమనం
ఆర్థికం కాకం కళ్లు
రూపి పాతాళం.

కొత్తలెక్కలు
పెరిగిన అప్పులు
జనం తిప్పలు

- రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

కేంద్రానికేమి అదరం
కేసులకిక బెదరం !
ఇది కేటీఆర్ ఉవాచ
మేము చెక్కుచెదరం !.

రాష్ట్రానికి కేంద్రానికి
చెడిపోతుందోయ్ సోపతి !
గల్లా పడితె ఒకరొకరు
లాగుతున్నారు ధోవతి !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు : మంత్రి తలసాని

హైదరాబాద్, మార్చి 1: కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేలు అందిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. 38 మంది లబ్ధిదారులకు రూ. 17.7లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ వైద్యసేవల్లో పెను మార్పులు వచ్చాయన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యం చేరువ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని, లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్లు సైతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల కోసం కోట్లాది వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషేంట్స్ తరఫు కుటుంబ సభ్యులకు రూ. 5కే భోజనం అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు.

విద్యార్థులకు ప్రేరణా-2023.. 3న లక్ష మందితో సదస్సు..

కరీంనగర్, మార్చి 1: ప్రేరణా-2023 పేరుతో యువతకు కరీంనగర్ పోలీసులు దిశా నిర్దేశం చేయనున్నారు. బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు మీడియాకు వివరాలు అందించారు. యువత పెడదారి పట్టకుండా క్రైంని అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ నెల 3న లక్ష మంది విద్యార్థులతో సదస్సు నిర్వహించనున్నారు. గంజాయి, డ్రగ్స్ మొబైల్ అప్లికేషన్ మోసాలు, ఆన్ లైన్ బ్యాంకింగ్ వీటన్నిటినీ ఎలా ఎదుర్కోవాలో తెలిపేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు.అన్ని కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించను న్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి సినీ హీరో రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ రచయిత, మోటివేటర్ వీరేంద్రనాథ్ లు హాజరుకానున్నారు.



తిమ్మాపూర్ వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో సీఎం కేసీఆర్ దంపతులు

బాన్సువాడ, మార్చి 1:కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు.

అక్కడ ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం సతీమణి శోభ.. దాతల సహకారంతో స్వామివారి కోసం తయారు చేయించిన 2 కిలోల బంగారు కిరీటాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా స్వామివారికి సమర్పించారు.

అనంతరం సీఎం దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సీఎం దంపతుల వెంట స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, బీబీ పాటిల్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. కాగా, అంతకుముందు బాన్సువాడకు చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘనస్వాగతం పలికారు.

అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కాగా, తిమ్మాపూర్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

కన్నుల పండువలా జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి.

సీఎం కేసీఆర్ వల్ల ఆలయాలకు పూర్వ వైభవం : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, మార్చి 1:సీఎం కేసీఆర్ తెలంగాణలోని పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా బుధవారం అత్యంత వైభవం గా జరిగింది.

యంత్ర ప్రతిష్ఠాపన, మూర్తి స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ, ఆలయ గోపురం ప్రతిష్ఠ, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ..శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి పాద స్పర్శ తో తిరుమలాయ పల్లె గ్రామం పావనం అయిందని అన్నారు. సీఎం కేసీఆర్ (అఓ ఐఅఖీ) దయవల్ల తెలంగాణలోని దేవాల యాలు అన్నీ పూర్వ వైభవాన్ని సంతరించుకున్నా యని పేర్కొన్నారు.నాంచారిమడూరు, సన్నూరు, పాలకుర్తి, బమ్మెర, వల్మీడి తదితర గ్రామాలలో గుడులన్నింటికీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఆలయానికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల వరకు మంజూరు చేయించానని, మరో రూ.50 లక్షల నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి వివరిం చారు . సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో, శాం తి సౌఖ్యాల తో ఉండాలని, కేసీఆర్ పరిపాలన సుదీర్ఘంగా సాగాలని దేవు ణ్ని కోరుకున్నానని మంత్రి తెలిపారు.

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతిష్ఠాపన పూ ర్తి కావడంతో ఇక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారు ప్రజలకు దర్శనం ఇస్తా రని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చాక దేవాలయాల జీర్ణోద్ధరణ, పునరుద్ధరణ బాగా జరిగిందని అన్నారు.

సింగరేణి అభివృద్ధిలో కార్మికులదే ప్రధాన పాత్ర.. ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కరీంనగర్, మార్చి 1: సింగరేణి అభివృద్ధి చెందడానికి కార్మికుల పాత్రే ప్రధానమైనదని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఆర్జీ-1 పరిధి 2ఎ బొగ్గు గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్మికుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శతాబ్దం చరిత్ర కలిగిన సింగరేణి అభివృద్ధికి కార్మికులు ఎనలేని కృషి చేశారన్నారు. కార్మికులు స్వంత ఊరును వదిలేసి, ఉద్యోగ, ఉపాధి నిమిత్తం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని సింగరేణిలో చేరి దేశాభివృద్ధిలో భాగమవుతున్నారన్నారు. కుటుంబం కోసం, విధి నిర్వహణ కోసం జీవితాలను త్యాగం చేస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యానికి అత్యధిక లాభాలు రావడంలో కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి కార్మికుల పక్షాన ఆలోచించి, పదవీ విరమణ కాలాన్ని మరొక సంవత్సరానికి పెంచి.. వారి ఆర్థిక అభివృద్ధికి సహకరించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులకు, కార్మికులకు ఇంక్రిమెంట్లు ఇచ్చారన్నారు. సింగరేణి కార్మికుల హక్కు అయిన వారసత్వపు హక్కును, మళ్లీ అమలయ్యేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. సింగరేణి క్వార్టర్స్ లో నివాసముంటున్న కార్మికులకే, ఆ క్వార్టర్లను శాశ్వతంగా కేటాయించే విధంగా కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు.

కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలందరూ సుఖశాంతులతో జీవిస్తున్నారన్నారు. ప్రజల గుండెల్లో కొలువైన కేసీఆర్ పై బురదజల్లడం కోసం కొంతమంది మూర్ఖపు నాయకులు యాత్రలపేరుతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనను యావత్ భారతావని కోరుకోవడంలోనే ఆయన ప్రజా సంక్షేమ పాలన మనకు అర్థమవుతుందన్నారు. ఇన్ని సంవత్సరాలుగా క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో విధులను నిర్వహించి, పదవీ విరమణ పొందుతున్న కార్మికులు ఇకపై తమ పూర్తి సమయాన్ని కుటుంబానికి వెచ్చించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఆనందమైన జీవితాన్ని గడపాలని ఆయన సూచించారు. అలాగే గనిలో ఏర్పాటుచేసిన మ్యాన్ రైడింగ్ సిస్టం త్వరలోనే వినియోగంలోకి వస్తుందని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గంట్ర దామోదర్ రావు, నాయకులు, గని కార్మికులు దొరగండ్ల మల్లయ్య, దాసరి నర్సయ్య, శేషగిరి, రియాజ్, శ్యాంసన్, రాజు, కళాధర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకటేష్, కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పర్లపల్లి రవి, కాల్వ శ్రీనివాస్, దొమ్మేటి వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మంత్రుల రాజీనామాలను రాష్ట్రపతికి పంపిన ఎల్‌జీ

న్యూఢిల్లీ, మార్చి 1: ఢిల్లీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజీనామాలను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్వీకరించి, వాటిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపినట్లు అధికారులు తెలిపారు. మానీలాండింగ్ కేసులో సత్యేందర్ జైన్, ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ విషయంలో మనీష్ సిసోడియాపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో విద్య, ఆరోగ్య సదుపాయాలు, పాలనా ఎజెండా అమలులో ఇద్దరు మంత్రులు కీలకంగా వ్యవహరించారు. ఇద్దరూ కేజ్రీవాల్‌కు విశ్వసనీయ నేతలు. అవినీతి ఆరోపణలతో ఇద్దరు నేతలు కేజ్రీవాల్‌కు దూరమయ్యారు. ఫిబ్రవరి 28న మంత్రులు మనీష్ సిసోడియా, సత్యందర్ జైన్‌ల రాజీనామాలను ఆమోదించాలని ముఖ్యమంత్రి చేసిన అభ్యర్థన మేరకు ఎల్‌జీ రాజీనామాలను ఆమోదించాలని కోరుతూ రాష్ట్రపతికి సిఫారసు చేశారని రాజ్ నివాస్ అధికారి ఒకరు తెలిపారు. ఇద్దరు మంత్రుల రాజీనామాల నేపథ్యం ఇద్దరు మంత్రి పదవులు దక్కే అవకాశం ఉన్నది.

సాత్విక్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు..

హైదరాబాద్, మార్చి 1:నార్సింగిలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్న సాత్విక్ క్లాస్‌రూంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఒత్తిడి వల్లే సాత్విక్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని విద్యార్థులు సైతం ఆరోపించారు. సాత్విక్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాలేజీ సిబ్బంది కృష్ణారెడ్డి, ఆచార్య, హాస్టల్ వార్డెన్ నరేష్ పేర్లను ఎఫ్ఐఆర్ లో నమోదు చేశారు. సాత్విక్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో సెక్షన్ 305 కింద కేసు నమోదు చేశారు.

నార్సింగిలో ఉద్రికత్త

నార్సింగిలోని శ్రీచైతన్య కాలేజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సాత్విక్ తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఆందోళనకు దిగారు. నార్సింగి చౌరస్తాలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం జరిగేదాకా ఇక్కడ నుండి కదలబోమన్నారు. ఈఎఖీలో చేర్చిన నిందితులను తమ ముందుకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. దీంతో సాత్విక్ తల్లిదండ్రులకు పోలీసులు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు.

జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలుస్తున్న దళిత బంధు : కలెక్టర్ ఆర్.వి.కర్ణన్

కరీంనగర్, మార్చి 1: తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అంచనాలకు మించి విజయవంతమై జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. మంగళవారం వీణవంక మండలం చల్లూరు గ్రామంలో ఐదుగురు దళిత బంధు లబ్ధిదారులు కలసి తెలంగాణలోనే మొట్టమొదటి అతిపెద్ద యూనిట్ భాగ్యలక్ష్మీ హోమ్ నీడ్, ఎలక్ట్రానిక్ ను జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దళితులను ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానానికి చేర్చేలా హుజురాబాద్, వాసాలమర్రి లలో పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన దళితబంధు పథకాన్ని ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడంతో అనుకున్న ఫలితాలను అధిగమించి దేశవిదేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. దీనితో పథకం అమలు తీరును గురించి తెలుసుకోవడానికి ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి స్టడీ నిమిత్తం మన దగ్గరకు తరచు వస్తున్నారని తెలియజేశారు. దళిత బంధు పథకం ద్వారా ఒకప్పుడు కూలీలుగా, కార్మికులుగా, డ్రైవర్లుగా పని చేసిన వారు ఇప్పుడు యజమానులుగా మారారన్నారు. కనీసం ఉండానికి సరైన ఇళ్లులేక, ప్లాస్టిక్ డబ్బాలను అమ్ముతు జీవనోపాధి కొరకు రాష్ట్రాలు తిరుగుతూ బ్రతికే నీల సంతోష్ దళితబంధు పథకం ద్వారా ఇదే గ్రామంలో మరో దళితబంధు లబ్ధిదారునితో కలిసి 20లక్షలతో శ్రీరామ ఫర్నీచర్, ఇంజనీరింగ్ వర్క్స్ అనే యూనిట్ ను ప్రారంభించాడన్నారు. షాపు నిర్వహణతో కోటిరూపాయల టర్నోవర్ తో అద్భుతమైన విజయాన్ని సాధించాడని, వచ్చిన లాభంతో ఇప్పుడు స్వంతంగా కారును కొనుగోలు చేసి ఆదర్శంగా నిలిచాడని తెలిపారు.

అమెరికన్ టూరిస్టర్ అనే షాపులో సేల్స్ మెన్ గా పనిచేసి కరోనాతో ఉద్యోగం కోల్పోయి కుటుంబ నిర్వహణ భారంగా మారిన కళ్యాణ్, దళితబంధు పథకం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అమెరిక్ టూరిస్టర్ బ్యాగు షాపును ప్రారంభించి మంచి లాబాలను గడిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారందరిని ఆదర్శంగా తీసుకుని దళితబంధు పథకం ద్వారా వచ్చిన డబ్బుతో అద్భుతంగా ఎదగాలని అన్నారు. అదే విధంగా తెలంగాణలోనే మొట్ట మొదటి అతిపెద్ద యూనిట్ ను ప్రారంభించిన జ్యోతి, శేశమ్మ, స్వప్న, దుర్గమ్మ, విజయలను జిల్లా కలెక్టర్ పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. అనంతరం చల్లూరు గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి, మామిడాల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తు కంటి వెలుగు శిభిరాన్ని సందర్శించారు. శిబిరంలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలను, డాటా ఎంట్రి విదానాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

ఫిబ్రవరి 26న తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో జరిగిన కొలకలూరి పురస్కారాలు (2023) ప్రదాన సభలో కొలకలూరి భగీరథ, కొలకలూరి విశ్రాంతమ్మ, కొలకలూరి రామయ్యల పురస్కార గ్రహితలు యార్లగడ్డ రాఘవేంద్రరావు, కటుకోజ్వల ఆనందాచారి, ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ, డా॥ఎం. దేవేంద్ర, డా॥ఎం.ఎ. నాగేంద్రలతో ముఖ్య అతిథి ఆచార్య టి. కిషన్‌రావు, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమన్ కిరణ్.

నేటినిజం
సాహితీ కిరణాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 2-3-2023

వాళ్లిద్దరూ
జీవిత ఖైదీలే
సంసారమనే
సాగరంలో



నానీలు

దమ్ముకు ధైర్యానికి
ప్రతీక
బండరాయిని
చీల్చుకొచ్చింది చెట్టు

-సోమేపల్లి వెంకటసుబ్బయ్య
9000004565

సంబరాలు

పిరికివాళ్ళ మాటల్ని
పట్టించుకుంటున్నావా?
భయపడుతూ
బతుకునీడుస్తున్నావా?

గట్టుగ సాగే అలవాట్లన్నీ
రట్టయ్యే రోజొస్తుంది
కర్మకాండలో కాకి భోజనం
కీలక సాక్షం చెబుతుంది.

ఎవరి మాటలో
ఎన్ని తోటలున్నాయో?
ఎవరి మాటలో
ఎన్ని తూటాలున్నాయో?

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్షలు

కథల రూపం దిద్దుకున్న జీవితానుభవాలు

ఒక మంచి కథను నిర్వచిస్తూ, ప్రముఖ సాహితీవేత్త శ్రీ సుధామగారు ఇలా అంటారు. **"ఒక మంచి కథ"** అని చదివాక పాఠకుడికి అనిపించటం మీదే రచయిత సామర్థ్యం ఆధారపడి వుంటుంది. ఇతివృత్తం శిల్పం పాత్రలు సంఘటనలు ఇవన్నీ కథకు ఎ.ని.ముతో ముడిపడినవే! ఈ ఎ.ని.ము ఏమిటంటారా? ఎత్తుగడ, నిర్వహణ ముగింపు రచయిత వీటిని ఎలా కావించి అందించాడన్న దాని మీదే మంచి కథ రూపొందుతుంది.

ఈ ఎ,ని.ములు కథా రచననే కాదు, ఏ సాహిత్య ప్రక్రియకైనా వర్తిస్తాయి. ఈ మూడింటిలో నిర్వహణ పాత్ర మరింత జటిలమైనది. ఎందు కంటే వస్తువు, ఎత్తుగడ ముగింపు, సుమారుగా ఉన్నా నిర్వహించిన/ నడిపిన తీరు ఆకట్టుకోగలిగితే, ఆ రచయిత 90శాతము కృతకృత్యుడైనట్లే!

సుమారు దశాబ్ద కాలము నుండి ఆర్.సి.కృష్ణ స్వామిరాజుగారు కథలు రాస్తున్నారు. సామాన్యుల జీవితాల్ని కథా వస్తువుగా చేసుకుని రాయటం వల్ల పాఠకులు కథల్లో తమని తాము చూసుకుంటున్నారు. కథకు దగ్గరవుతున్నారు. తర్వాత రచయితకు దగ్గరవుతున్నారు. ఈ కథల్లో రాజుగారు ప్రదర్శించే మరో విశేషం. 'బాష'గా చెప్పవచ్చును. తిరుపతి ప్రాంతపు వాడుక మాటలు సామెతలు, తన కథల్లో పొదగటం వల్ల సందర్భోచిత హాస్యం వ్యంగ్యం, ఒక్కో



చోట 'మనిషితనం' మరియు దైనందిత జీవితాల్లో ఎదుర్కొనే బాధలు కష్టాలు పాత్రల ద్వారా పరిచయం చేయటం వల్ల ప్రతీకథా పాఠకుడి మనసును తాకుతు, ఉద్వేగానికి లోను చేస్తాయి. కథల్లోకి పాఠకుడిని లాగుకుంటాయి. నవ్వుతూ మనల్ని నవ్విస్తూ ఆలోచింపజేస్తాయి. రాజుగారి కథల్లో ఎక్కడ అనవసర వర్ణనలు సాగదీతలు ఉండవు. వైవిధ్యమైన వస్తువు వల్ల ఏ కథకు ఆ కథే ప్రత్యేకం అనిపిస్తాయి. అధిక శాతం కథల్లో, బాల్యం దాటి కౌమారంలో ప్రవేశిస్తున్న ముఖ్యపాత్ర వల్ల కథలన్నింటా Continenty కనిపిస్తుంది.

పల్లెటూళ్ళలో కనిపించే కనకక్క, తుకారాము, లోకరాజు. పాడురంగం, గోవిందుడు, కిష్టడు మరదలు మీనాక్షి, దేశమ్మ కాశెమ్మ సుబ్బులు, మును స్వామి, కార్తవరాయుడు మనకు తారసపడి గ్రామీణ వాతావరణాన్ని సృష్టిస్తారు. రెడ్డోళ్ళ బావి రచ్చబండ కానుగచెట్టు క్రింద మంచం, చౌడేపల్లికి పోవాల్సిన ఎర్రబస్సు గుడ్డి కండ్రిగ, కటవయి (పొదలు) గెనాలు, కయ్యలు కోలవలు- వాటి వివరాలతో టవున్ల దగ్గరుండే పల్లెలు, గ్రామాలును పరిచయం చేస్తాడు రచయిత.

జాతీయాలు, నానుడులు, సామెతల్ని సందర్భానుసారంగా వాడుకోవటంలో రచయిత తన పరిపక్వతను చూపుతారు. విదియ నాడు కాకపోతే తదియనాడు, తిర్రి కట్టటం (బీడి కాల్చుకునేందుకు పొడుగు గుడ్డను దారం మాదిరి చేసి కొనను అంటించి వేలాడదీయటం) అత్తగారింట సుఖం మోచేతి మీది దెబ్బ (దెబ్బ కనబడదు కాని నొప్పి పెడుతుంది) రచ్చబండ రచ్చరచ్చ చేయటం, నాకే లేదు నాకుడు బెల్లం, ఆవు పచ్చిపేడ గోడ కేసి కొడితే అతుక్కుపోయినట్లు (పోలిక) కొంగు ఇంగువ, నవాబు పొట్టా తమలపాకు కట్టా (ఎప్పుడూ తడుపుతూనే ఉండాలి) కుళ్ళి కుళ్ళి కాయనష్టి కాలి కాలి కట్టినష్టి, పనీ లేదు పాటా లేదు పట్టత్తా నీ కాళ్ళన్నా మొక్కతా ఉంటే ఉగాది లేకుంటే ఉరిసెన (పస్తు), నాకే లేదు నాకుడు బెల్లం, నీకెక్కడి నుండి తెచ్చేది గోకుడు బెల్లం-లాంటి పల్లె మాటలు కొల్లలు. సరదాగా కాలక్షేపాన్నిచ్చే కథలివి. రాజుగారికి అభినందనలు.

ప్రతులకు: ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
22-4-71,
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ
మంగళం రోడ్
తిరుపతి-517 507
సెల్: 9393662821

- కూర చిదంబరం
సెల్: 8639338675

ఆమె అనంత సాహిత్యానికి సృష్టికర్త

-డా.కత్తి పద్మారావు
సెల్: 9849741695

ఆకాశం వంగి
భూమిని తాకుతుంది
భూమి పువ్వులా వికసించింది
నక్షత్రాల మొక్కలు
కొల్లేరు సరస్సులో మొలుస్తున్నాయి
ఆ పక్షుల కుహూరావాలకు
అలలు నృత్యం చేస్తున్నాయి
ఆ చేప మింగుతున్న
నీటి బిందువుల్లో శృతి ఉంది
ఆ ఈతలో సంగీతం ఉంది
ప్రకృతంతా అనుబంధంగా ఉంది
నిజమే!
వివాదమెందుకు?
భాష రాకా?
భావము లేకా?
బాంధవ్యం కుదరకా?
సంబోధన చేయకా?
సామరస్యం లేకా ?
ఎందుకు?
అభినందనలు లేని వారి జీవితం
నిందా సహితమౌతుంది?
ఆ రాతి విగ్రహానికి సాగిలపడి
వెయ్యి దండాలు చదువుతాడు
సతిని చూసి ఈసడించుకుంటాడు
వ్యతిరిక్తాలు పెంచుకుని
వైముఖ్యుడవుతాడు
కళ్ళు కదపని శిల్పాన్ని చూసి
ఎందుకీ దండకం?
నీకు అన్నం పెట్టే అతివపై
ఎందుకు ఈ విరసం?
దేన్ని పొందుతున్నావో
దాన్ని నిరాకరిస్తున్నావు
నీ స్వరంలో నుండి
నిప్పు రవ్వలు కురుస్తున్నాయి
అవి నిన్నే దహిస్తున్నాయని
నీవు తెలుసుకోలేక పోతున్నావు
అవును!
మీరు ఎవరి దగ్గర
తల వంచి అభ్యర్థిస్తున్నారో
వారి తలలే తుంచుతున్నారు
బిందెలు బిందెలు పాలు
రాళ్లపాలు చేసే మీరు
పాలబొట్టు పుట్టుకకే
గాటు చేస్తున్నారు
మిమ్మల్ని మీరు
తెలుసుకునే వరకూ
మీరు ఓడిపోతూనే ఉంటారు
మీరు చీకటి గుహల్లో
పెద్దగా కేకలు వేస్తున్నారు
మీ శబ్దాలు మీకే వినిపిస్తున్నాయి
మీ చేతులకు పచ్చబొట్లు
నామవాచకాలుగా పొడిపించుకుంటున్నారు
మీ గుండెల మీద మాత్రం
ఒక చిత్రం లేదు
అందుకే మీరు ఒక్కసారి
పునర్నివేచించుకోండి
మీరు కోల్పోతున్నది మిమ్మల్నే
ఎవర్నో కాదు
మిమ్మల్ని మీరు కోల్పోయాక
మీరు ఎవరిని పొందుతారు?
ఆత్మీయత
అమృత నిష్యందమైనది
తోడు జీవన గమనానికి వాహిక
మీరు తోడును నిరాకరించాక
ఎవరి హృదయ క్షేత్రంలో
శిల్పమై నిలవగలరు?
మీరు మీ మిత్ర హస్తాన్ని ఛేదిస్తున్నారు
మీరు మార్మిక ఇనుపకచ్చదాలు
వారికి కడుతున్నారు
మీ కళ్ళల్లో అనుమాన
వలయాలున్నాయి
వారి ఆప్తవాక్యానికి
మీరు భయపడుతున్నారు
స్నేహం మానవ జీవన ప్రవాహిక
స్త్రీ ఒక సౌర కుటుంబ సామూహిక
సూర్యుళ్లు, చంద్రుళ్లు
ఆమెలోనే జనిస్తారు
అవును!
ఈనాటి ఆత్మగౌరవ స్వరం ఆమె
అందుకే నిన్ను నిజాయితీతో
నిలవేస్తోంది
ఆమె బానిస కాదు
ఆమె భావోజ్వల జీవన సుస్వరం
ఆమె ప్రవహిస్తున్న నది
అందులో దాగున్న సుస్వరాలు
మాతృగర్భితమైనవి
మమతానురాగాల పూరితమైనవి
నిరాపేక్ష త్యాగపూరితమైనవి
ప్రేమపూర్వితా అభీయుక్తమైనవి
ఆమె ప్రతి ఉనికిలో
సంగీత గీత సాహితీ
పరిమళాలున్నాయి
ఆమె అనంత సాహిత్యానికి
సృష్టికర్త
ఆకాశం అంచుల దాకా
నడుస్తున్న విజేత.

సామాజిక చైతన్యభరితం సోని కట్కూరి 'తర్కం'

జనవరి 25వ తేదీన ప్రతి ఏటా జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహి స్తున్న సెంట్రల్ ఎలక్షన్ కమీషన్ యిటీవలే 2023 సం॥లో 13వ వార్షిక ఓటరు దినోత్సవం దేశమంతటా నిర్వహించింది. దీని ఉద్దేశ్యం 18 సం॥లు నిండి కొత్త ఓటర్లను నమోదు చేసుకోవడం, ఓటు విలువ, ఓటరు హక్కులను పౌరులకు తెలియజేయడం తద్వారా సమాజంలో చైతన్యం పూరించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఉద్యమం యిది. ఎక్కువ సంఖ్యలో ఓటర్లను పోలింగ్ బూత్‌ల వైపు తరలించడమే ధ్యేయంగా చేపడ్తున్న కార్యక్రమం. ప్రజా స్వామ్యం పరి రక్షణకు బలమైన పునాది ఓటు. ప్రపంచ దేశాల్లో అతి పెద్ద ప్రజా స్వామ్య దేశం మనది. ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటును వినియోగించుకుంటే స్వార్థరహిత, నీతి వంతమైన పరిపాలనకు నోచుకుంటార నడంలో సందేహమే లేదు.

కానీ ఎన్నికలనేవి మన దేశంలో ఓ ప్రహసనంలా మారి ప్రజాస్వామ్యం అపహాస్య పాలవుతుందనేది నిస్సం దేహంగా నిజం. యిటీవలే తెలం గాణ రాష్ట్రంలో అసెంబ్లీకి జరిగిన ఒక ఉప ఎన్నికలో ఓ రాజకీయ పార్టీ ఓటుకు ఐదువేల రూపాయలు పంచిపెడ్తే మరో పార్టీ ఆరువేల చొప్పున పంపిణీ చేసింది. దీనితో బాటు మద్యం సీసాలు, కోళ్ళు కూడా విరివిగా పంచి పెట్టారన్నది బహి రంగ రహస్యం. పవిత్రమైన ఓటు అంగడిలో అమ్మకం వస్తువుగా మారి పోయిన పరిస్థితుల్లో కోట్ల రూపాయలు వెదజల్లి ఎన్నికయిన అభ్యర్థి నిజా యితీగా, అవినీతి రహిత పరిపాల నను ఎలా అందించ గలడు? ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించ గలడు? ఎన్నికలకు అయిన ఖర్చును రాబట్టు కోవడంలో.. యింతకు యింత సం పాదించుకోవ డంలోనే తల మునకల వుతాడు. దేశంలో జరిగే ఏ ఎన్నికల్లో ను 50 నుండి 60 శాతంకు మించి ఓటు హక్కు వినియోగం కావడం లేదు.

నగరాలు, పట్టణాల్లోని సింహ భాగం ఓటర్లు ఓటు వేయడానికి నిరా శక్తత కనబడడం మనసుకు తెలిసిందే. పల్లెల్లోని నిరక్షరాస్యులు ప్రలోభాలకు లొంగిపోయి ఓటును అమ్ముకోవడం కూడా చూస్తూనే వున్నాం. అందుకే సమాజంలో ఎక్కడ చూసినా అవినీతి, లంచం విచ్చిన్నంగా రాజ్యమేలుతున్న సందర్భం ఇది.

యిప్పుడు కావాల్సిందల్లా సామా జిక చైతన్యం. ఓటర్లను జాగృత పర చడం. ఓటు విలువను తెలియ జేయ డం. ఓటు హక్కు వినియోగిం చుకునేలా ఉద్యుక్తుల్ని చేయడం. యిది కేవలం ఎలక్షన్ కమీషన్, ప్రభుత్వం పూనుకుంటే జరిగేది కాదు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. మేధావులు ఈ దిశగా ఆలోచించాలి. రచయితలు, కవులు తమ కలాలను ప్రబోధాత్మకంగా ఝుళిపించాలి.

ఓ బాధ్యతగల పౌరురాలిగా కవయిత్రి సోని కట్కూరి **'ఓటు'** ఏక వస్తువుగా 30 కవితలతో **'తర్కం'** పేరిట ఓ కవితా సంపుటితో మన ముందుకొచ్చారు. తార్కికంగా విశ్లేషిస్తు ఓటర్లను చైతన్యబరిచే ప్రయత్నం చేశారు.

ఉత్తమ ప్రభుత్వాలను ఎన్నుకోవ డంలో పౌరులను అప్రమత్తం చేస్తూనే అక్కడక్కడా మహిళా సమస్యలను ప్రస్తావిస్తు సాగుతుంది సోనీ కవిత్వం. కవయిత్రి దృష్టిలో ఎన్నికలు ఓ



పవిత్ర యుద్ధం. ఈ యుద్ధంలో ప్రజలకు చేతికందివచ్చిన బలమైన ఆయుధం 'ఓటు', అంబేద్కరు మహాశయుడు కల లుగన్న అసలు సినలైన ప్రజాస్వా మ్యం సిద్ధించాలంటే ఓటు సద్వినియోగమే సరియైన బాణం-మార్గం.

"వ్యాపారం మొదలెట్టినోళ్ళు
సేవకులెందుకైతరు?
సావును అలవాటు చేసే
మాంత్రికులైతరు"

కోట్ల రూపాయలు వెదజల్లి పదవిని దక్కించుకునే స్వార్థ రాజకీయ నాయకులకు ప్రజాసేవ పట్ల దృష్టి ఎందుకుంటుంది? ప్రజల అవస రాలతో వ్యాపారం చేసే యమకింకరు లవుతారని కవయిత్రి భావం.

''ఓటేయని స్వాములకు
దాసోహ మైన రాజకీయాలు
ఎలక్షనయ్యేవరకు మా కాళ్ళు
నాకే
గెలిసినంక స్వాముల
సంకనాకు తరా!
పనికిరాని దేవాలయ
నిర్మాణాలు కాదు
దేశానికి ఉపయోగపడే
విద్యాల యాలు పునర్నిర్మించు"

వేలకోట్ల ప్రభుత్వ స్థలాలను ధార్మిక సంస్థలకు ఉచితంగా కట్టబెట్టి.. నిరుపయోగమైన ఆకాశాన్ని అంటే ప్రతిమలు స్థాపించి, మతాధిపతులకు దాసోహమంటున్న రాజకీయ నాయకులకు యిదో చురక. ఇటీవలే ఓ స్వాముల వారిని పద్మభూ షణ్ పురస్కారంతో గౌరవించిన దుస్సంప్రదాయం మనది. నిజమైన సర్వసంగ పరిత్యాగికి ప్రభుత్వం యిచ్చే పురస్కారాలు అవసరమా? ఆలోచ నలను రేకెత్తించే ప్రశ్న లేవనెత్తారు కవయిత్రి.

"పైకం కోసం అమ్ముడుపోయి
బానిసగిరి చెయ్యనీకి
వీలునామా రాసిచ్చిన ఓటరా.
అవినీతికి తోబుట్టువు నువ్వే
ఎన్నేండ్లయినా మారనే మారవు"

సమస్య మూలాన్ని ఎత్తి చూపుతున్నారు సోనీ కట్కూరి.

"ఓ బీసీ.. బైసెందుకు?
పిడికిలెత్తి చూడు
జన గణన మనదే
గణరణ పోరు మనదే"

జనాభాలో అధికశాతం వున్న వర్గాలకు అధికారం దక్కట్లేదని కవయిత్రి ఆవేదన. వారందరూ ఏకమై నడుము బిగించాల్సిన అవసరం వుందని ఉద్బోధిస్తున్నారు సోని.

"ఓటంటే బతుకు నిర్వచనమి
ప్పుడు
ఓటంటే దేశ చరిత్రే ఎప్పుడు"

మరి ఓటర్లు?

"ప్రజాస్వామ్య సౌధాన పునాది
రాళ్ళు ఓటర్లు"

సమాజంలో పేరుకుపోయిన కుల,మత వివక్ష పట్ల కవయిత్రి ఆక్రోశం, కవితల్లో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. స్త్రీ, విద్యావంతురాలైన ప్పుడే ఆమెకు నిజమైన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ లభిస్తాయని సోని ధృఢ నమ్మకం. సావిత్రీబాయి పూలే ఆమెకు ఆదర్శం.

మధ్యంతర ఎన్నికలను అకాల వర్షాలతో పోల్చడం గొప్ప ఊహ. బాగుంది.

మూడు పదుల వయస్సులో ఒక బాధ్యతాయుతమైన కవిత్వాన్ని తొలి ప్రయత్నంగా కలానికెత్తుకోవడం కవయిత్రి సామాజిక స్పృహకు అద్దం పడ్తోంది.

ఓటు విలువ, ఓటరు బాధ్యత, ప్రజాస్వామ్యంలోని పౌరుల ప్రాథమిక హక్కులు, అవినీతి రహిత ప్రభుత్వ ఏర్పాటు ఆవశ్యకత ఇత్యాది విషయాలపై చక్కని అవగాహన కల్పిస్తు సోని అల్లిన కవితలు పాఠకులను అలరిస్తాయనడంలో సందేహం లేదు.

కవితలన్నీ ఓ వరుస క్రమంలో పేర్చి, పదే పదే పునరాకృతమైన అంశాలను ఏరివేసి చదివితే ఈ ఏక వస్తు కావ్యం ఓ దీర్ఘ కవితలా రూపుదిద్దుకుంటుంది.

కవన రంగంలో తొలి అడుగుల కారణంగా అక్కడక్కడా తడబాటు సహజంగానే దర్శనమిస్తుంది. సామాజిక ప్రయోజనం సిద్ధించాలనే ఉద్దేశంతో కవిత్వ సృజనగావించిన సోని కట్కూరి ఆ ప్రయత్నంలో సఫలీకృతులయ్యారనే చెప్పవచ్చు.

ప్రతులకు: సోనీ కట్కూరి
31/3/1332/15/18
కోమటిపల్లి రోడ్,
పోలీస్ కాలనీ-6, వడ్లేపల్లి,
హన్మకొండ-506 370
సెల్: 8374261002

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

రోడ్లకు సిగమొచ్చింది

నా నగరం రోదిస్తుంది
నాణ్యత లేని రోడ్లు చూసి
ఎక్కడ చూసినా గుంతలే
ఎక్కడ చూసినా క్రంతలే
కింద ప్రవహించే డ్రైనేజీ
రోడ్లమీది కొచ్చింది
మోరునీళ్లు బోరునీళ్లు
కలిసి కాపురం చేస్తున్నవి
వానకాలంలో రోడ్లన్నీ జలమయం
ఎత్తిపోతల పథకం
ఎంచక్కా ఇక్కడే వర్ధిల్లినట్లు!
నోరు తెరుచుకున్న మైన్‌హోల్స్
బంతితొ పాటు ఆడుకుని
బాలుణ్ణి మ్రింగేసింది
అదృష్టవశాత్తు ఆ కాలనీ ప్రజలు
బ్రతికిపోయారు సుమా!
లేకపోతే క్రుంగిన రోడ్డు క్రింది
డ్రైనేజీ కాలువలో పడి చచ్చేవారు!
రోడ్డు మీద పెద్దరంధ్రం పడింది
నల్గురు పోలీసులక్కడున్నారు కనుక
ప్రమాదం తప్పింది!
రోడ్లు వెడల్పైనవి
కాని దుకాందార్ల వాహనాలన్నీ
రోడ్లపైనే
ఫ్లై ఓవరు బ్రిడ్జిలు కట్టారు
కాని వాటికిందనే
వాహనాల పార్కింగులు!
ఎత్తుపల్లాలు లేని రోడ్లు
ఎక్కడా కనిపించవు.
మేడిపల్లి నుంచి
మియాపూర్ వెళ్లాలంటే
రెండు గంటలు!
అదే టైంలో వరంగల్‌కు
వెళ్లవచ్చు!
రోడ్ల మీదనే పండ్ల దుకాణాలు
చిరు వ్యాపారాల చిరుదిండ్ల బండ్లు
ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు మహర్దశ
రోడ్డుమీద బండాపి కావల్సింది తినొచ్చు
రోడ్ల మీదనే యువరత్నాలు
ఫోన్ సంభాషణలు సాగిస్తారు
బస్సులప్పుడప్పుడు
రోడ్ల మీదనే ఆగిపోతాయి!
పెళ్లి పందిళ్లకు రోడ్లే అనువైనవి.
అటు తిరిగిపోండని చెప్పే బోర్డులు!
సర్కారు బస్సులు తప్ప
ఏ వాహనమూ రోడ్డుమీద నిలపరాదనే
నియమం ఎప్పుడో గాలికొదిలేశారు
ఎలాస్టిక్ రోడ్లొస్తే బాగుండు!
చక్కగా ఇంటి ముందే రోడ్డెకి
అనుకున్న వాళ్లింటికి వెళ్లొచ్చు.
అదేమి చిత్రమో
వర్షం వస్తే చాలు
రోడ్లు నీళ్లొసుకుంటాయి.
ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణమని శ్రీశ్రీఅంటే
ఏ రోడ్డు చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణమని
ఆధునికకవి వాపోతున్నడు
కరెంటు, డ్రైనేజీపై పూల కోసం
ఎన్నిసార్లైనా గాయపడే రోడ్లు!
ఒక దిక్కు తవ్వుతుంటే
మరోవైపు మూసేస్తారు.
యజమానులు కొందరు
పిల్లలకంటె కుక్కల్నే బాగా పెంచుతారు
అప్పుడప్పుడు వాటిని గాలికొదిలేస్తారు
ఇంటి కుక్కలకూ బజారు కుక్కలకు పోట్లాట!
కోపంలో శునకాలు పెద్దల్ని కరుస్తాయి
పిల్లల్ని వెంటబడి చంపుతాయి
నా నగరం నవ నాగరికతకు గీటురాయి
దిష్టితీసిన జీడిగింజలూ,
నిమ్మకాయలు రోడ్డమీదనే
రణగొణ ధ్వనుల మధ్య మా ప్రయాణం
అడుగడుగున ఎదురయ్యే స్పీడ్ బ్రేకర్లు
స్టాక్ మార్కెట్టులో కనిపించే బ్రోకర్లు!
రోడ్ల మీదనే రైతు బజార్లు
వెజిటబుల్ మార్కెట్లకు వెళ్లేపనిలేదు
రోడ్ల మీదనే వైన్ షాపులు
బార్లకు పరిగెత్తాల్సిన పని లేదు
సోయితప్పింది ప్రజలా? .
ప్రభుత్వమా?
రోడ్లకు సిగమొచ్చింది,
రోడ్లకు సిగమొచ్చింది.



- ఆచార్య మసన చెన్నప్ప
సెల్: 9885654381

పుస్తక సమీక్షలు

'ఉషా కిరణాలు'- కవయిత్రి బండి ఉష కవితా సంపుటి

"పచ్చటి మాగాణాలు పులకరిస్తేనే
పసిడి రాసుల సిరుల నిచ్చు
మట్టి వాసనకు చెమట చుక్కతోడైతే
కాలం మాటున దాగిన
కడగండ్లకు, కష్టాలకు ముగింపు"

తొలకరి చినుకులకై ఎదురు చూసే నేలతల్లి ఆర్తిని, వేదనను కవయిత్రి, బండి ఉష 'నిరీక్షణ' కవితలో చిగురింపచేస్తారు. ప్రకృతి నుండి పొందిన జ్ఞానాన్ని, యాభైనాలుగు, జాలువారిన కిరణాలుగా, 'ఉషా కిరణాలు' కవితా సంపుటి ఆవిష్కరిస్తోంది. గణిత, యోగా ఉపాధ్యాయనిగా, గృహిణిగా, ఆధ్యాత్మిక స్ఫూర్తితో కవితా రంగం లోకి అడుగుపెట్టిన ఈ కవయిత్రి, అసలైన జీవితానందాన్ని అందుకోలేని మనిషి గురించి, తప్పు దోవపడుతున్న ప్రస్తుత సామాజిక ధోరణుల పట్ల పరివర్తన ఆశించే అభిలాష, సామాజిక చైతన్యం కవితలలో స్పందింప చేసారు. పూజ్యశ్రీ భిక్షమయ్య గురూజీ, ఆశీస్సుల పుత్రికా వాత్సల్యం, అనుగ్రహం పొందిన 'ఆధ్యాత్మిక సమం'గా కవయిత్రి, 'యావత్ సృష్టికి కాలచక్షువు కవిత్వం అంటూ ఎల్లల్లేని ఆనందానుభూతిని ప్రతిరూపంగా అందరికీ అభిలషిస్తారు. వివిధ పత్రికలలో, సంకలనాలలో ప్రచురిత మైన కవితలలో సినీ కళాకారుడు రంగనాథ్‌కు అశ్రునివాళి, శాస్త్రవేత్త, అబ్దుల్ కలంకు నివాళి, నేలరాలిన సూరీడు 'మండేలా',



ధృవతార జయలలిత, సవ్యసాచి సినారె, యుగకర్త శ్రీశ్రీ, వంటి కవితలు సంపుటిలో చోటు చేసుకొన్నాయి. కాలచక్ర భ్రమణంలో ఆనవాళ్ళు కనుమరుగవుతున్న 'కొండ'ను గురించిన కవితలో, మీతిమీరిన నరుడి స్వార్థకాంక్ష, భవిష్యత్ తరాలకు మనుగడ ప్రశ్నార్థకం చేసే, బండల ఛిద్ర విధ్వంసనం గురించి గుండె కదిలించే కవితా వ్యక్తీకరణ కవయిత్రి ప్రతిభకు అద్దం పడ్తోంది.

"ఉషోదయం లేకపోతే విషాదమే
అక్షరమే లేకపోతే అంధకారమే"

అంటూ పరిమళించే మేధతో నడయాడే మౌన ప్రబోధాలే ఉషాకిరణాలు అంటూరు కవయిత్రి బండి ఉష. ఆఖరి కవిత 'మరణం' లో ఆత్మ ఘోషించే ఎవరికీ వినిపిం చని మానవ నైజమైన జీవన సత్యం, అద్భుతంగా తాత్విక ప్రవృత్తితో ప్రతిబింబంపచేసారు.

ప్రతులకు:
శ్రీ సత్యసాయి ధ్యానమండలి,
ఇ.నెం. 54-20/3-18,
ఫ్లాట్ నెం. 62,
సాయినిలయం, సిమ్రన్ కాటేజ్
గురునానక్ కాలనీ, 2వ లైన్
విజయవాడ- 520 008
సెల్: 98497 25540

-జయసూర్య
సెల్:9014948336
9394775088

నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-8)

బారసాల తోనే
ఆ కుటుంబంతో బంధం తెగిపోయిందని
అనుకున్నది అత్తమ్మ
ఎందుకోగాని,
ముందుకెళ్ళనీకె ఆమె కాల్జేయి ఆడ్తలేదు.
అందుకు తగ్గట్లుగానే
ప్రయాణానికి అడ్డంగా వాగు పొంగి పొర్లుతున్నట్లు
సరయూ కంటికి మంటికి ఏకధార గట్టింది.
'చిన్నమ్మా ! సన్న పోరి నీకు బాగా సనుగయ్యింది.
ఉండిపోరాదు, నేను అన్నకు జెప్త....'
అని దర్శనం గూడ పట్టువడుతుండటం
ఆమె కాళ్ళకు సంకెళ్ళుగ మారింది.
కన్న కొడుకుకు అంత ఆమురాతమేం లేదు!
కోడలు సంగతి చెప్పనవసరం లేదు
ఆమెకు
అక్కడి కంటే ఇక్కడనే మనసు నిండుతది.
కాని
కన్న పేరు 'థూ' అన్నా
కప్పుకోని పోక తప్పది కదా!
పసి దాని స్పర్శ
సరయు పంచే ప్రేమ
దర్శనం మంచితనం
లోకంలో ఇంకెక్కడా దొరకవని
ఆమెకు తెలుసు
అయినా.... కొన్ని వదులు కోలేం -
ఇంకొన్ని కాపాడుకోలేం.
ఇదే బతుకంటే...
అందని వీటికోసం నిచ్చెనలెయ్యకుండా ఉండలేం.

అందిన వాటిలో ఆనందాన్ని పొందలేం...
ఏ జన్మలో పుణ్యమో
ఈ పిల్ల (ల)తో ఇన్ని రోజులు సంతోషం...
తలచుకున్న కొద్దీ ఆమె గుండె చిల్లు పెద్దదై
కన్నీరు వెల్లువెత్తుతున్నది....
అయినా ఆమె ఆగదని సరయుకి తెలుసు.
అమ్మకాని ఆయమ్మ తనకు అన్నీ అయ్యి,
గుండె నిండా ప్రేమను పంచిన అత్తమ్మకు
ఏమిస్తే ఋణం తీరుతది?
వెయ్యిరూపాయలకు మించిన
చీర తీసుకున్నది... జీవితంలో మొదటిసారి
ఆమె కిష్టమైన యాపిల్ పండ్లు తీసుకున్నది.
మనసు నిండలేదు!
అన్నీ ఒళ్ళో పెట్టి.
రెండు వేల రూపాయలు చేతిలో పెట్టి
రెండు కాళ్ళనూ గట్టిగ పట్టుకున్నది!!
ఆమె కాళ్ళను ఈమె,
ఈమె నెత్తిన ఆమె
కన్నీళ్ళతో అభిషేకించుకున్నరు!
అప్పుడత్తమ్మ
తుపాకీ తూటా వంటి మాటొగటన్నది...
"ఏంది బిడ్డా!
కూలిచ్చి, ఈ అత్తమ్మ ఋణం తీర్చుకుంటున్నవా? " అని.
కాలం స్తంభించింది!
సరయు చైతన్యం కోల్పోయింది !
'అత్తమ్మా ! ' అన్నది తేరుకొని... ఇంకోమాట వస్తలేదు
ఎంత ప్రయత్నం జేసినా.
'అయ్యో! పిల్ల ఏమనుకున్నదో...'
అనుకున్నది అత్తమ్మ.
'అత్తమ్మా ! దేవుడు గూడా కానుకలు వద్దనడు...
ఇది నీ పేద బిడ్డ ప్రేమతో ఇస్తున్నది.
దీనికి లెక్కగడ్తవా?
నీకు లెక్కగడ్తనా? 'నీప్రేమకు లెక్కగడ్తనా?'
అనాలనుకున్నది.
కడుపులోని బాధ
ఇద్దరి గొంతులనూ నొక్కేసింది
ఒకరి నొకరు పట్టుకొని
తనివితీరా ఏడ్చేసినారు
వాళ్ళిద్దరినీ చూస్తున్న కాలం
'మీరిద్దరూ సల్లం గుండాలి ! ' అనుకున్నది
కదలని అత్తమ్మ అడుగులు కదిలినయ్.
వదలని సరయు పట్టుదల సడలింది.
అత్తమ్మ పసిగుడ్డుకు
ఆఖరి ముద్దు ఇచ్చింది.

-దోరవేటి
సెల్:9866251679

బలిపీఠాలపై స్త్రీల జీవితాలు

(గంటి భానుమతి 'రాయలమ్మ కథ')

మన ఘనతవహించిన సమాజం మన ప్రమేయం లేకుండానే మనల్ని కానివాళ్ళను చేస్తుంది. ఎందుకూ కొరగాని వాళ్ళుగా తక్కువ చేస్తుంది. విధి వల్ల వంచితులు కోకొల్లలు ఈ లోకంలో. స్త్రీల విషయంలో విధి, సమాజం, లోకం మాధ్యమాలుగా వాళ్ళ జీవితాలపై నిఘా పెట్టి నియంత్రణల పిడిబాకుల్ని దించడానికి కాచుకొని ఉంటుంది. స్త్రీ అస్తిత్వాన్ని బలిపీఠంపైకి ఎక్కించే వరకు కుట్రలూ కుతంత్రాలూ చేస్తూనే ఉంటుంది.

'రాయలమ్మ' పేరు కొత్తగా చిత్రంగా ఉన్నా ఆమె సామాన్య స్త్రీ. ప్రేమార్ద్రతలు నిండుగా ఉన్న స్త్రీ. తన పేరు విషయంలో ఆమెకు చిన్నపాటి గర్వం. ముంగండ గ్రామవాసి జగన్నాథ పండితరాయలు వంశం పేరును ఆ గ్రామస్తులు అటు ఇటుగా మార్చి తమ పిల్లలకు పెట్టుకుం టారు. రాయలమ్మ పేరు అలా వచ్చింది.

పన్నెండో ఏట రాయలమ్మకు సిద్ధాంతితో పెళ్ళవుతుంది. ఉమ్మడి కుటుంబం. తెల్లవారింది మొదలు ఆమె ఇంటి పనుల్లో మునిగి తేలుతుంటే పంచాంగాల కట్ట ముందేసుకొని అరుగు మీద కూర్చుంటాడు సిద్ధాంతి. జనం రకరకాల విషయాలు కనుక్కునేందుకు కిక్కిరిసిపోతారు. ఆమె ముగ్గురు పిల్లలూ పూరిట్లోనే చనిపోతారు. ఆ దు:ఖం తీరకముందే పాము కరిచి సిద్ధాంతి పోతాడు. అన్ని రకాలుగా పంచాంగాలు చూసి మంచిరోజులు చెప్పే అతను రాయలమ్మకు ఏమీ చెప్పకుండానే వెళ్ళిపోతాడు. ఇంక ఆమెకు ఎవరూ లేనట్టే.. ఆమె ఒంటరి జీవితపు ప్రయాణం మొదలవుతుంది.

ఆ పెద్ద కుటుంబంలో వంటింటికీ సామాన్ల గదికీ ఆమె కదలికలు పరిమితమై పోతాయి. ఆమెకు ఎలాంటి కోపతాపాలు కలగకూడదని ఇంట్లోవాళ్ళు ముందే బంధం వేసేవాళ్ళు లౌక్యంగా. తక్కువ పూజలు చేస్తే ఎక్కువ ఫలితం ఎందు కిస్తాడు దేవుడు వచ్చే జన్మలో బాగుండా లని దేవుడిని కోరుకో అనేవాళ్ళు వచ్చే జన్మ వరకూ ఎందుకు ? ఈ జన్మలో మంచి ఫలితం ఎందుకివ్వడు దేవుడు.. ఎదురుచూడాలా అనిపించేది రాయల మ్మకు.

అటు పుట్టింట్లో ఇటు భర్తింట్లో పనులకోసం జీవితాన్ని అంకితం చేసిన సమయంలో దూరపు బంధువులింట్లో తన అవసరమొచ్చి అక్కడికి చేరుతుంది. ఆమె ఇక తన జీతాన్నీ, జీవితాన్నీ తన చేతుల్లోకి తీసుకునే సమయమొచ్చిందని

మూఢత్వం, దురహంకారం, ప్రేమరా హిత్యం, స్వార్థకాంక్షల్లో పడి మనిషితత్వానికీ మానవత్వానికీ ఘోర అపకారం చేస్తూ చట్టాల్లోకిరాని నేరస్తులుగా సమాజాన్ని విచ్ఛిన్నం, అసంబద్ధం చేస్తున్న సామాజికులదే ఈ పాపమంతా.

అనుకొంటుంది. బాధ్యతగా కాకుండా తనవాళ్ళకు చేసినట్లుగా ప్రేమతో పనులన్నీ చేసిపెడ్తుంది.

పొట్టి చేతుల తెల్ల రవిక మీది నుంచి చిన్న రుద్రాక్షల్ని వెండితీగెలో చుట్టి మాలజారుతుంటే, వేళ్ళకి వెంకన్నబాబున్ను దర్భముడి వెండి ఉంగరం తెల్ల చీర కొంగును నెత్తిమీద నుండి కుడి భుజం మీదుగా ముందుకు దోపుకుంటుంది.

ఆ ఇంటి పిల్లలయిన లక్ష్మి ఇద్దరు తమ్ముళ్లూ ఆ కొంగును లాగేసి గుండు మీద ఓ రెండు మొత్తులు మొత్తి వెళ్ళిపోతే రాయలమ్మ విసుక్కోకుండా నవ్వుతూ గుండు మీదికి చెంగుని లాక్కొని చెవుల వెనక్కి దాన్ని దోపి చెవుల్ని ముందుకు లాక్కునేది.

ఆమె ఆ ఇంటి నుండి కాలుబయటపెట్టేది లేదు. ఎవరినుండీ ఏమి ఆశించేది కాదు. ఉన్నచోట ప్రేమగా సేవలూ పనులూ చేసిపెట్టడం ఆమె స్వభావం.

దేవుడు నిన్ను అన్యాయం చేసాడనీ, నీకిన్ని కష్టాలు వచ్చిపడ్డాయనీ ఎప్పుడైనా బాధపడ్డావా అని లక్ష్మి అడిగితే. తనలాంటి వాళ్ళను ఎందరినో చూసాను కనుక తనూ అంతే అనుకుందట. మాకు అడ్డదారులుం డవు, కష్టపడవలసిందే.. రోజులు ఇలాగే గడపవలసిందే.. సూరీడికి వీపు చూపించి సూరీడంటే నీడల్ని పోగేసేవాడు అనటం అనుకోవడం అర్థంలేనిది అన్న వ్యక్తిత్వ వికాసం రాయలమ్మది.

ఆమెకు మౌఖిక పాండిత్యం తండ్రి నుండి వచ్చింది. బాగా పుస్తకాలు చదివిన వాళ్ళే జీవితాలూ చదివే ఉంటారు అనుకోలేము.

ఆమె ఏక సంథాగ్రహి. లక్ష్మి ఆమెకు రాయడం చదవడం నేర్పిస్తుంది. వంకర టింకర అక్షరాలతో 'లెఖ్మి' అని రాస్తుంది, పిలుస్తుంది.

ఆ ఇంటి పిల్లలు పెద్దవాళ్ళవుతారు ఉద్యోగాలూ పెళ్ళిళ్ళూ... లక్ష్మి తల్లికి ఇక పెద్దదయిన రాయలమ్మ అవసరం కనిపించదు. అవసరాలు తీరిన తరవాత విసిరి అవతల పారేయడం లోకం తీరు కదా. లక్ష్మి తల్లిని అలా రాయలమ్మను

పంపించేయడం అన్యాయమనీ అదే మీ అమ్మ అయితే ఈ వయసులో పంపించేస్తావా అని ప్రశ్నిస్తుంది.

రాయలమ్మ లక్ష్మిని తల్లికన్నా ఎక్కువగా తల్లిలా చూసుకున్నది. ఆమెతో స్నేహంగా తనలోని మాటలూ, విషయాలు చెప్పుకున్నది. ఇద్దరూ ఒకరికొకరు గురువులుగా, మిత్రులుగా ఉన్నారు. ఇంటి పెద్దమనిషిని ఒక ఆవులా, గేదెలా పంపించివేయాలన్న తల్లిదండ్రులు ఆలోచన ఆమెకు సహించలేదు.

రాయలమ్మను ఎప్పుడు ఊరికి పంపించబోయినా చలికాలం ఊర్లో ఇలా ఉంటుంటదనీ ఎండాకాలం మరోలా వానాకాలం మరోలాంటి వాతావరణం గురించి చెప్తూ వెళ్ళడం దాట వేస్తుంటుంది. లక్ష్మితో నన్ను నీతో తీసుకుపోకూడదా అని జాలిగా అడుగుతుంది. లక్ష్మి కదిలిపోతుంది.

రాయలమ్మ ఊర్లో ఆస్తులకు సంబంధించి సంతకాలు ఏదో కావాలని... ఆమెను ముంగండ ఊరికి పంపించమన్న పిలుపు వస్తుంది. ఎంతో నచ్చజెప్పిన మీదట ఆ సంతకాలేవో చేసేసి వెంటనే వచ్చేస్తాను అని ఉత్సాహం చూపుతుంది.

ముంగండకు వెళ్ళిన రాయలమ్మ రెండు నెలల కాలంలోనే జబ్బుపడుతుంది. కబురు తెలిసిన లక్ష్మి కుటుంబం ఆమెను చూడడానికి ముంగండ వెళతారు.

తన ఒంట్లో ఊరికి వెళ్ళడానికి ఏ కొంచెం ఇష్టం కూడా లేని ఆమె కదలలేక కదలలేక కబేళాకు తోలుకుపోయిన గొడ్డులా వెళ్ళిన రాయలమ్మ తాటాకు చాపమీద తెల్లబట్ట చుట్టుకొన్న అస్థి పంజరంలా ఉంటుంది. ఆమె మరీ ఇంత పెద్దదా అనుకుంటుంది లక్ష్మి. అక్కడి ఆడవాళ్ళు వంగి ఆమె చెవిలో ఏదో చెప్తే కళ్ళు తెరిచిన రాయలమ్మ వాళ్ళను గుర్తుపట్టదు. బంధువులు ఈ రెండు నెలలూ ఆమెను ఏమీ కష్టపెట్టకుండా ఎంత బాగా చూసుకున్నారో వంతులేసుకొని లక్ష్మి నాన్నకు చెప్తుంటారు.

భౌతిక, భవబంధాలను విడిచిపెట్టి రాయలమ్మ ఆ పూట వెళ్ళిపోతుంది. ఆవిడ ఖర్మకాండలను ఏ లోటు లేకుండా చేయండని లక్ష్మి నాన్న యాభై వేలు బంధువుల ముఖాలు వెలిగిపోతుండగా చేతిలో పెడ్తాడు.

తమ ఊరికి చేరిన లక్ష్మి స్టోర్‌రూమ్‌లో ఉన్న రాయలమ్మ పెట్టె తెరిచి చూస్తుంది. లక్ష్మి మూడేళ్ల నాటి నుండీ అన్ని ఫోటోలు పిల్లలవీ వివిధ దశల్లోవి ఉంటాయి. లక్ష్మి అమ్మమ్మ తోలు సంచిని లక్ష్మిని అడిగితీసుకున్న దాంట్లో ఆమె జీవితంలో ప్రతి కష్టం ప్రతి పైసా ఉంటుంది. ముప్పై ఏళ్ళ ఆ శ్రమ ఆ తోలు సంచిలో నిశ్శబ్దంగా ఒదిగిపోయి కనిపిస్తుంది. ఇంక ఆ పెట్టెలో ఏమీ ఉండదు. ఫోటోలు సంచీ తప్ప. ఆ ఫోటోల వెనుక వంకర టింకర అక్షరాలతో 'లషిమి' అని రాసి ఉంటుంది. నా పేరు తప్పు రాసావు అని పైకే అనేస్తుంది లక్ష్మి. సిగ్గుపడుతూ ఈసారి సరిగ్గా రాస్తానులే అంటున్నట్లుగా రాయలమ్మ ముఖం కనిపించి లక్ష్మి ఒక్కసారిగా భోరున ఏడుస్తుంది.

భర్త చనిపోతే ... పిల్లలూ లేకపోతే... ఆ స్త్రీలు దాదాపు అనాథలవుతారు. లోకం అనాథలు, దిక్కులేనివాళ్ళనే అంటుంది. నిజానికి వీరంతా ఒంటరి స్త్రీలుగా భావించబడుతారు. చాలా మంది నా కర్మ ఇంతే అనుకుంటూ పూజలూ, పుణ్యస్నానాలూ, ఉపవాసాలతో బతుకు బండి ఒంటి చక్రంతో లాగిస్తుంటారు. ఇదీ

దేవుడు నిన్ను అన్యాయం చేసాడనీ, నీకిన్ని కష్టాలు వచ్చిపడ్డాయనీ ఎప్పుడైనా బాధపడ్డావా అని లక్ష్మి అడిగితే. తనలాంటి వాళ్ళను ఎందరినో చూసాను కనుక తనూ అంతే అనుకుందట.

మానవ సంబంధాలు అలుక్కుపోయి అంతరించిపోయాయి. ఇసుకలో రాసిన అక్షరాల్లా చెదిరిపోయి ఇసుకతో కట్టిన పిచ్చుకగూళ్ళలా కుప్పకూలిపోయి, పిడికిట్లో పట్టిన ఇసుకలా జారిపోయి.. దైన్యంగా ఉన్నాయి.

'రాయలమ్మ'లు కథ కోసం కల్పితాలుగా సృష్టించబడిన పాత్రలు కాదు. సంక్షుభిత నిజ జీవనపథంలోంచి వచ్చిన పాత్రలే. ఇలాంటి వ్యక్తులు మనకు తారసపడినా ఇలాంటి కథాంశాలు చదివినా హృదయం ద్రవిస్తుంది. వారి నుదుట ఎవ్వరో మానవాతీతులు రాసినవి కాదు ఆ తక్కువ రాతలు. కర్కశ సమాజం దిగ్గొట్టిన మేకులు ఆ రాతలు.

రచయిత్రి గంటి భానుమతి 300 లకు పైగా కథల రచన చేసారు. పదుల సంఖ్యలో నవలలూ ఎన్నో వ్యాసాలూ రాసారు. పది కథా సంపుటాలు, పదకొండు నవలూ, వ్యాసాల సంపుటీ ప్రచురించారు. 2015లో ప్రచురించిన 'సాగర మథనం' కథా సంపుటిలో 'రాయలమ్మ' కథ ప్రత్యేకంగా కనిపిస్తుంది. లోకుల కుళ్ళునూ లోకంలోని కాలుష్యాన్నీ బహిరంగం చేస్తుంది. వ్యవస్థను శుభ్రం చేయడం పరిశుభ్రంగా పెట్టడం మన బాధ్యతేనని చాచికొట్టి తెలియజేస్తుంది.



-అనిశెట్టి రజిత,
ఫోన్: 9849482462

స్పెషల్

నేను అమ్మానాన్నలకెంతో స్పెషల్
నిజానికి నాకు నేనే ఓప్రెషల్ స్పెషల్
నా కోరికలు, కలలు.. హైలీ స్పెషల్
నా ప్రతి కదలికా సెన్సేషనల్ స్పెషల్! స్పెషల్!

నేనేం చేసినా.. ఏదో స్పెషల్
నేనేమీ చెయ్యకున్నా.. అదో స్పెషల్
నా కోపం, రోషం.. ఎంతో స్పెషల్
నేను పడే గారాబమూ సర్టెన్‌లీ స్పెషల్! స్పెషల్!

నా డ్రెస్సింగ్ సెన్స్ ట్రెండీ స్పెషల్
నా గాడ్జెట్స్.. వర్ల్డ్ క్లాస్ స్పెషల్
నా ప్రవృత్తి, ప్రాధాన్యతలు.. అరుదైన స్పెషల్
నేనున్న టీనేజీ టిపికల్లి స్పెషల్! స్పెషల్!

నా లిక్కర్ బ్రాండ్ స్పెషల్
నా పెర్‌ఫ్యూమ్ స్మెల్లూ స్పెషల్
నా ఆశలు, అలవాట్లు- వెరీ వెరీ స్పెషల్
నాకు భయంతో పరిచయం లేకపోవడం
గొప్ప స్పెషల్! స్పెషల్!

నా డిఫరెంట్ స్టైల్ సింప్లీ స్పెషల్
నా సర్కిల్.. నా స్టేటస్‌కి తగిన స్పెషల్
నన్నాపి, అడిగేవారు లేకపోవడం
నా ప్రివిలైజ్డ్ స్పెషల్
నా చుట్టూ పొగడ్తలు శాలువాలు కప్పే వాళ్ళుండడం
స్పెషల్! స్పెషల్!

నా అడ్వెంటెర్స్ ఆల్వేస్ స్పెషల్
నా థ్రిల్లింగ్ డ్రైవింగ్ సూపర్ స్పెషల్
నా ఫుల్ పర్స్, బిగ్ గట్స్..
నాకు మాత్రమే స్పెషల్
నా కారిలా ఎదుటి కార్ని ఢీ కొట్టి
పల్లీలు కొట్టడమూ స్పెషల్! స్పెషల్!
బట్..
నేనిలా రోడ్డుపై బడి..
ఊపిరాడక.. ఉక్కిరిబిక్కిరవడం
నేనేనాడూ ఊహించని..
తలంచని స్పెషల్! స్పెషల్!

- ఎస్. కాశింబి
సెల్: 9052216044

తంత్రులు తెగిన వీణను సవరిస్తే...

సామాజిక సమస్యలు ముఖ్యంగా మహిళా సమస్యల దృష్టికోణంలో కథలు, నవలలు రాస్తున్న రచయిత్రి సోమంచి శ్రీదేవి నవల 'సంగమం'. పితృస్వామ్య భావజాలం వేళ్ళూని ఉన్న భారతీయ సమాజంలో ఒక వితంతు మహిళ పునర్వివాహం, దాని పర్యవసానాలు ఇతివృత్తంగా సాగిన నవల సంగమం. ఆచారాల పేరిట స్త్రీలను అన్నింటా అవమానపరుస్తూ, వాళ్ళ ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ హింసించడం మన సంస్కృతా ? ఇదేనా సంప్రదాయమంటే ? భార్య చనిపోయిన మగవాడికి లేని ఆంక్షలు, కట్టుబాట్లు, ఆక్షేపణలు భర్తను కోల్పోయిన స్త్రీకి మాత్రం ఎందుకు ? అంతేకాదు ఆ స్త్రీ భర్తలేడన్న కారణంగా 'వితంతువు' అనే ప్రత్యేక పదంతో పిలవబడుతూ ఈ సమాజం నుండి పరాయీకరించబడటం అన్యాయమేగా. ఈ సమస్యను సామాజిక కోణం నుండి చూసి ఆ భావజాలాన్ని ప్రశ్నిస్తూ సమాజాన్ని చైతన్యీకరించే బాధ్యత మనందరిపైనా లేదా ? ఇలాంటి ప్రశ్నలతో కూడిన ఆలోచనలను రేకెత్తించే అనేక అంశాలు 'సంగమం' నవలలో చిత్రీకరించబడ్డాయి.

ఇద్దరు వ్యక్తులు జీవితాంతం కలిసి ఉండాలి అనే ఒప్పందాలతో ఏర్పరచుకున్న కొన్ని కట్టుబాట్ల అంతిమ రూపమే 'పెళ్ళి' అంటూ మొదలైన ఈ నవలలో ప్రధాన పాత్ర కిరణ్మయి చిన్నవయసులోనే పెళ్ళయి, భర్తను కోల్పోయి పరిస్థితుల ప్రభావంతో పునర్వివాహం చేసుకున్న కిరణ్మయి చుట్టూ అల్లుకోబడిన అనేక సమస్యలు, సంఘటనలు, సంవేదనలు, సంఘర్షణలు, భయాలు, ఆందోళనలు మొదలైనవన్నీ ప్రస్ఫుటంగా కళ్ళముందుంచే విధంగా నవలను సృజియించారు రచయిత్రి కాలేజీలో చదువుకుంటున్న ఒక సాదాసీదా అమ్మాయికి పెళ్ళవుతుంది. ఆ తర్వాత సంవత్సరానికే ఆమె భర్త యాక్సిడెంటయి కాలును కోల్పోయి, ఆ బతుకును ఊహించి తట్టుకోలేననే భయంతో ఆత్మహత్య చేసుకుంటాడు. అప్పటికే ప్రెగ్నెంట్ అయిన కిరణ్మయినీ, ఆమె కడుపులో పెరుగుతున్న ప్రాణినీ తమ మాటలతో చేతలతో హింసిస్తూ ఉంటారు బంధువులూ, చుట్టుపక్కలవాళ్ళూ. ఈ పరిస్థితి మన సమాజంలోని అమానవీయ ఆలోచనా విధానానికి అద్దంపడుతుంది. కిరణ్మయికి పుట్టిన పాపపేరు శాంతి. అందరూ ఆమెను నష్టజాతకురాలంటూ అవమానిస్తుంటారు. శాంతి తల్లి రెండో పెళ్ళి కారణంగా ఆమెను ద్వేషిస్తూ శాంతి రెండేళ్ళ పిల్లగా ఉన్నప్పుడే తండ్రి తరపువాళ్ళు ఆమెను తెచ్చుకొని, పెంచి ఇంటర్ వరకు చదివించి భాస్కర్ అనే అతనితో పెళ్ళి చేస్తారు. అక్కడే అసలు కథ మొదలవుతుంది. అయితే శాంతి తల్లి భర్త చనిపోయిన తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకున్నదన్న నిజాన్ని దాచి ఆమె చనిపోయిందన్న అబద్ధంతో పెళ్ళి జరుగుతుంది. అసలు విషయం తెలిసిన భాస్కర్ అతని కుటుంబం శాంతినీ, ఆమె తల్లినీ సూటీపోటీ మాట లంటూ బాధించి ఆమెనక్కడే వదిలి వెళ్తారు. వీళ్ళెవరూ ఆమోదించని పెళ్ళి శాంతి తల్లిది. అంత తెగించిన దాన్ని ఎక్కడా చూడలేదు. అంటూ దూషిస్తారు. ఈ సంఘటనతో శాంతి మనసులో రకరకాల ఆలోచనలు - తను పుట్టకముందే తండ్రి చనిపోయాడటు తల్లిని తనెప్పుడూ చూడలేదు. ఆమె జీవితాన్ని ఆమె సరిదిద్దుకుందేమో కానీ తనపట్ల చేసింది మాత్రం తప్పే. తప్పు ఆమెదైతే శిక్ష మాత్రం తనకు చిన్నప్పుడే పెదనాన్న ఇంటికి చేరిన తను అక్కడ అనుభవించిన ఆర్తీ, ఆప్యాయతలూ ఏమీలేవు. అందరూ ఉన్నా అనాథలా పెరిగింది. ఇంకోవైపు ఎవరెన్ని రకాలుగా చెప్పినా వినిపించుకోడు భాస్కర్. అతని తల్లి "ఆడవాళ్ళు రెండోపెళ్ళి చేసుకోవడం ఎక్కడా వినలేదు. పెళ్ళే చేసుకుందో, చేసుకుందని చెప్పుకుంటున్నారో అన్నీ సవ్యంగా ఉంటేనే ఆడవాళ్ళకు పెళ్ళిళ్ళు అవడంలేదు. అలాంటిది భర్తపోయి నదాన్ని, పిల్ల తల్లిని చేసుకునే వాళ్ళెవరు ? అదీ ఆ రోజుల్లో ? ఎలాంటి బతుకు బతుకుతోందో ? ఛీ... ఛీ... ఎంత పరువు తక్కువ, అలాంటి తల్లికి పుట్టిన పిల్ల మనింటి కోడలంటే" - అంటుంది. ఇట్లా అనేవాళ్ళు మన చుట్టూ చాలా మంది ఉంటారు. అలాంటి వాళ్ళు మార్పునసలే ఒప్పుకోరు.

ఒక వితంతువైన మహిళపట్ల సమాజ ధోరణి, కుటుంబ సభ్యుల ఆలోచనలు ఆమె పునర్వివాహాన్ని చూసే దృష్టికోణాలు, విభిన్న అభిప్రాయాలు ఈ నవలలో వివిధ పాత్రల ద్వారా మనకు కనిపిస్తాయి. ఒకవైపు భర్తలేడన్నీ బాధను అనుభవిస్తూ ఇంకోవైపు అత్తగారింట్లో ఆచారాలు, సంప్రదాయాల పేరుతో జరిపే తంతులన్నీ ఆమెను మానసిక క్షోభకు గురిచేస్తాయి. ఆమెనలా చూసి తట్టుకోలేని పుట్టింటివారు ఆమె జీవితాంతం వైధవ్యాన్ని అనుభవిస్తూ బతకాల్సిన అవసరం లేదని భావించి కిరణ్మయిని, పాపను వాళ్ళతో తీసుకెళ్తారు. ఆమె దృష్టిని మళ్ళీ చదువువైపు మళ్ళించడానికి కిరణ్మయి అన్న స్నేహితుడైన గోపాలకృష్ణను ఇంట్లోనే ట్యూటర్‌గా పెడతారు. భార్యనూ, కూతురినీ కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న గోపాలకృష్ణ జీవితంపై బాగా అవగాహన ఉన్న వ్యక్తి కాబట్టి అతను బాధలో ఉన్న కిరణ్మయిని ఓదార్చుతూ, "పెళ్ళి విఫలమైతే మరో ప్రయత్నం చేయవచ్చు కిరణ్. ఇంత దు:ఖం నీకు మంచిది కాదు. నీ చుట్టూ ఉన్నవారితో సంబంధాలను చెడగొడు తుంది. తర్వాత నీ మానసిక ఆరోగ్యాన్ని, ఆ మీదట నీ శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీసి నిన్ను అగాధంలోకి తోస్తుంది. ఇందులోంచి బయటకు రావడానికి ప్రయత్నించు బాగా చదువుకో. వ్యక్తిత్వాన్ని పెంచుకో. మంచి ఉద్యోగం సంపాదించుకో. నీ కాళ్ళ మీద నీవు నిలబడు. నీకు చేయూతనిచ్చేవాళ్ళు ఎదురైతే పెళ్ళి చేసుకో" అంటాడు. దానికి కిరణ్మయి నాకు మళ్ళీ పెళ్ళేమిటి ? ఒకసారి పెళ్ళైంది పాప కూడా పుట్టింది. నా ప్రాప్తం ఇంతే అంటుంది. ఈ సందర్భంలో ఇక్కడ "వైధవ్య దు:ఖాన్ని సమాజం స్త్రీ మీద వేసి రుద్దుతోంది కాబట్టి ఆమెను అందులోంచి బయటకు రానివ్వరు కాబట్టి బతికున్నంత కాలం ఏడుస్తోంది. వంటికి గాయమైతే మందులు రాసి దాన్ని నయం చేసుకుంటాం. మనసుకు గాయం అయితే దాన్ని కెలుక్కొని కెలుక్కొని మనని మనమే హింసించుకునే మనుషులం. అది అవతలి వారి గాయమైతే మరీ సు:ఖం మనకి. కిరణ్మయి, ఆమె మనస్థితి చీకట్లో కొట్టుమిట్టాడుతుంటే ఈ సమాజం తమాషాగా చూస్తుంది కాని చీకట్లోంచి ఇవతలికి రావడానికి దారి చూపించదు సమాజాన్ని అది తన మీద రుద్దిన వైధవ్యాన్ని మినహాయించుకొని చూస్తే తనకు మళ్ళీ పెళ్ళి ఎందుకో కిరణ్మయికి అర్థమవుతోంది" కిరణ్మయిలోని ఈ ఆలోచనా విధానం కథలో తరువాత మలుపులకు పునాది అవుతుంది. ఆమె మనసును అర్థం చేసుకున్నవాళ్ళుగా ఆమె తల్లి, తండ్రి, అన్నదమ్ములు, నాయినమ్మ ఇతర కుటుంబ సభ్యులు ముఖ్యంగా ఆమె పెద్దన్నయ్య కిరణ్మయికి గోపాలకృష్ణతో పెళ్ళి చేస్తే ఆమె జీవితం చక్కబడుతుందని భావించి ఆ ప్రతిపాదన ఆమె ముందుంచుతారు. దానికామె లోకం గురించీ వాళ్ళు దానిని వక్రీకరించే ధోరణి గురించీ ఆలోచిస్తుంది. నిజానికి అదే జరుగుతుంది. కిరణ్మయి, గోపాలకృష్ణల గురించి గోపాలకృష్ణ పనిచేసే కాలేజీలో వేరేగా మాట్లాడుకుంటారు. దానికి కిరణ్మయి, గోపాలకృష్ణ ఏమిటి ఈ లోకం ? కాన్త చనువుగా మాట్లాడుకోగానే పెడార్థాలు తియ్యడమేనా అని బాధపడతారు. మరో భావం లేకుండా మగవాడితో మాట్లాడితేనే తప్పుపట్టే సమాజంలో పుట్టినందుకు కూడా చాలా బాధపడుతుందామె.

తర్జన భర్జనలు జరిగిన మీదట ఇంట్లో అందరూ సంయమనంతో, ముందుచూపుతో ఆలోచించి గోపాలకృష్ణతో ఆమె పెళ్ళి చేయడమే సరైన నిర్ణయమనుకుంటారు. మళ్ళీ పెళ్ళి పట్ల చుట్టాలూ పక్కాలూ ఏమనుకుంటారు ముఖ్యంగా తన రెండేళ్ళ కూతురు శాంతి భవిష్యత్తేమిటి అని పరి పరి విధాలుగా ఆలోచిస్తుంది కిరణ్మయి. అయితే ఆమె మనసు గోపాలకృష్ణ తన కూతురి పట్ల చూపించే అభిమానం కొంత సానుకూలంగా ఆలోచించమంటుంది. అది ఆమెను సంఘర్షణకు గురి చేస్తుంది. కుటుంబ సభ్యులందరూ ఆ విషయంలో ఆలోచించే తీరు ఆమెను ప్రభావితం చేస్తుంది. 'ఆడది కూడా మనిషే మగవాడికిలాగే ఆమెకు కూడా రక్తమాంసాలుంటాయి. అవి ఉన్నాయి కాబట్టి కోరికలు కూడా ఉంటాయి. కోరికలంటే కామం ఒక్కటేనని అనుకోకు తనకూ ఒక ఇల్లు ఉండాలని, తన బ్రతుకు తాను బతకాలనీ, అందరిలాగే నవ్వుతూ తిరగాలనీ ఉంటుంది. కడుపున పుట్టిన బిడ్డ చనిపోతే స్త్రీని పోయినవాళ్ళతో మనం కూడా పోతామా అని ధైర్యం చెప్పి మళ్ళీ తల్లి కావడానికి సంసిద్ధురాలిని చేస్తారు. ఆ సమస్య కేవలం ఆమెకు మాత్రమే పరిమితం భర్త పోయిన స్త్రీ విషయంలో అలా కాదు ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఆమె పిల్లలు అనాథలై సమాజానికి బరువౌతారేమోనని భయం ఉంటుంది. చనిపోయిన వాడి ఆస్తి లావాదేవీలు ఉంటాయి. అందుకే ఆమెను అణిచేస్తారు తల్లీ ! ఇవి జగన్నాథ రథ చక్రాలు. కదలాలంటే కొందరు వాటి కింద పడి నలిగి పోవాలి. ఇప్పుడు రోజులు మారాయంటున్నారు. మగవాడి ఆలోచన కూడా ఉదారమైందని చెప్తున్నారు. అతడు శాంతి బాధ్యత కూడా తీసుకుంటా నన్నాడు అంటూ పాపపు పనేమోనని ఒకవైపు పీకుతున్నా మరోవైపు నీ ముఖం చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది, అంటూ ఆమె నాయినమ్మ పాత్రతో అనిపిం చడం పాతకాలం భావాలు ఉన్న మనిషే అయి నా తన అనుభవంతో మనవరాలిని ఒప్పించే ప్రయత్నం ఆలోచింపజేసే విషయాలు.

కూతురుకు చేసే రెండో పెళ్ళి వల్ల బంధువుల నుంచి తిరస్కారాలు వస్తాయనీ, ఇంకా అనేక సవాళ్ళకు ఎదుర్కోవలసి ఉంటుందనీ ఊహిస్తూనే ముందుకెళ్ళాలని అనుకుంటాడు ఆమె తండ్రి ఆ నిర్ణయం వల్ల అతని రెండో కూతురి పెళ్ళి ఆగిపోతుంది. చివరకు తమ కాబోయే కోడలికి కిరణ్మయి కుటుంబంతో ఎలాంటి సంబంధం లేకుండా ఉండాలి అనే ఒప్పందంతో ఆ పెళ్ళవుతుంది. ఆ పెళ్ళి సందర్భంగా జరుగుతున్న పెళ్ళి పనులు చూస్తుంటే కిరణ్మయి అంతరాంతరాల్లో ఎక్కడో చిన్న కదలిక చిన్నదే గానీ గడిచే జీవితపు క్షణక్షణంలో రక్తపు అణువణువులో వేళ్ళు నాటుకుపోయి విస్తరించుకున్న సాంప్రదాయమనే మహావృక్షాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించి వేయగలంత మౌలికమైన కదలిక అది. ఆ కదలిక భావంతోటే రచయిత్రి కథను ముందుకు నడిపిస్తుంది. ఎన్నో ఆలోచనల అలజడిలో ఉన్న కిరణ్మయిని 'అలా తిరగబోకమ్మా! అందరికీ ఎదురురాకు అన్న ఒక బంధువు మాట ఎంత చిత్రవధకు గురిచేస్తుందో ఊహించవచ్చు. ఆమెకా బాధ కలిగించడం ఇష్టంలేని కుటుంబ సభ్యులు ఆమెను గోపాలకృష్ణతో ఎక్స్‌కర్షన్‌కు పంపించడానికి ఏర్పాట్లు చేస్తారు. అది పెళ్ళింట్లో చాలా సంచలనాన్ని రేపుతుంది. అక్కడే ఉండి చెల్లెలి పెళ్ళి చూడకూడదంటే బాధపడుతుంది. 'రెండోయేడు పందిట్లో ఒకవార కూర్చోపెడదామన్నా కుదరదు' అని మళ్ళీ అక్కడ ఆచారాలను చర్చించుకొని ఆమెను గోపాలకృష్ణతో పంపించడానికి సిద్ధమవుతారు. కూతురు శాంతిని కూడా తనతో తీసుకెళ్ళాలనుకున్న కిరణ్మయి తల్లి వద్దనడంతో 'తనంటే విధి వంచితురాలు వేడుకల్లో స్థానం లేదు. దానికేం' అనుకోవడం భరించరానిదే అయినా సంప్రదాయం కనుక భరించాలి అన్న భావనతో కూడిన దురాచార సంస్కృతిని ఎత్తి చూపించారు రచయిత్రి ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళినచోట తను పెళ్ళి గురించి ఆందోళన పడుతున్న ఆమెతో గోపాలకృష్ణ అనే మాటలు సమాజంలో మగవాళ్ళలో కూడా కొంతమంది సంస్కారంతో ఆలోచించే వాళ్ళుంటారని అర్థమవుతుంది. మాటల మధ్యన ఆమె అతనితో 'సాంప్రదాయానికి ఎదురీదినందుకు నన్నెప్పుడూ అవమానించనని మాటివ్వండి' అనడంలో ఆమె ఆత్మగౌరవం కనిపిస్తుంది. వాళ్ళిద్దరూ దండలు మార్చుకున్నాక ఆమె మనసులో రేగే అలజడులు, అంతర్మథనం కిరణ్మయిలాంటి స్త్రీలందరి ఆవేదనకు ప్రతిరూపం.

పెళ్ళి తర్వాత కిరణ్మ యి ఆందోళనలను, ఆశ యాలను అర్థంచేసుకున్న గోపాలకృష్ణ కిరణ్మయి అన్న చందూ మాటలను చెప్తూ 'కొడిగట్టిన దీపంలా ఆరిపోయే బదులు మరో దీపాన్ని వెలిగించవచ్చు కదా ! అది నీకు కూడా వెలుగునిస్తుందేమో అని, నువ్వలా వితంతువుగా ఉండడం తనకు ఇష్టం లేదు అన్నాడని, వితంతువు అన్న పదానికి అతనిచ్చిన నిర్వచనం - వితంతువు అంటే తంతువు తెగి ఉండటం.. తెగిన వీణలా, నువ్వు అట్లా ఉండొద్దని' మా అందరి అభిప్రాయం అంటాడు. తను కూడా భార్యనూ, కూతురునూ ఎలా కోల్పోయాడో చెప్తాడు. తరువాత తల్లి రెండో పెళ్ళి కారణంగా ఆ కుటుంబంలో ముఖ్యంగా ఆమె కూతురు శాంతి జీవితంలో వచ్చిన పెనుమార్పులలో భాగంగా పెదనాన్న ఇంట్లో ఉన్న శాంతి తల్లి దగ్గరకు చేరడం, గోపాలకృష్ణ కూడా ఆమెనాదరించడంతో ఆమె ఆ కుటుంబంలో ఒక సభ్యురాలిగా కలిసిపోతుంది. వాళ్ళందరి సహకారంతో చదువు కొనసాగించి, ఉద్యోగం సంపాదించి ఆత్మగౌరవంతో బతకాలనుకోవడం సానుకూల పరిణామం. తల్లి మళ్ళీ పెళ్ళి కారణంగా శాంతిని వద్దనుకున్న భర్త తన తప్పు తెలుసుకోవడంతో శాంతి జీవితం చక్కబడుతుంది. అంతేకాదు కిరణ్మయి, శాంతిల చుట్టూ ఉన్న వాళ్ళందరి తప్పుడు అభిప్రాయాలు క్రమేణా మారడం పురోగామి అంశం. అనాదిగా సమాజం పెట్టిన నియమ నిబంధనలలో చిక్కుకున్న కొన్ని జీవితాలు ముఖ్యంగా ముగ్గురి జీవితాల్లో రేగిన కల్లోలం,

గాయం

(కథ)

పరుగెడుతూనే ఉంది విశ్వైక. కాళ్ళకి ముళ్ళు గీసుకుపోతున్నా, రాళ్ళు ముళ్ళయి గుచ్చుతున్నా, పాదాలు రక్తాలు కారుతున్నా లెక్క పెట్టడం లేదు. ఆ బాధ ఆమె లక్ష్యాన్ని ఏమీ సడలించడం లేదు. వెనక్కి తిరిగి ఆ సెకను సమయాన్ని సైతం వృధా చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదు. ఆమె లక్ష్యం ఒకటే! వెనక వెంబడిస్తున్న ఆకారం నుండి వీలయినంత దూరం వెళ్లిపోవాలి. అతని చేతులకు అందనంత దూరం వెళ్లిపోవాలి. ఆపకుండా పరుగుపెట్టడం వల్లనేమో గొంతు తడారి పోతోంది. దాహానికి ప్రాణం పోయేలా ఉంది. అల్లంత దూరంలో నీటి చెలమ. ప్రాణం లేచి వచ్చినట్లయ్యింది. ఒక్క నిమిషం అయితే అందుకునేదే. కానీ, సరిగ్గా అప్పుడే పడింది గట్టిగా భుజం మీద చేయి. అవి గింజుకుంటున్న ఆమెను నొక్కి పట్టి ఆక్టోపస్ లా బంధిస్తున్నాయి. ఆమె శక్తి వంచన లేకుండా పెనుగులాడుతూనే ఉంది. కాని బలమైన ఆ చేతుల నుండి తప్పించుకోలేకపోతోంది.

"ప్లీజ్ దయచేసి నన్ను విడిచి పెట్టండి!" అరుస్తూ గింజుకుంటూ ఉంటే, చేతికి చిక్కిన జింకను చూసిన పులిలా వికటాట్టహాసం చేసిందా ఆకారం. ఆకారం మనిషే కాని తల మాత్రం వ్యాఘ్రం. అంతలోనే ఆ తల మాయమైంది. సుపరిచితమైన ముఖం ప్రత్యక్షమైంది. దగ్గరకు వచ్చిన ఆ ముఖం మరెవరిదో కాదు తన భర్తది. ప్రేమించి ఇంట్లోవారిని ఎదిరించి, అతనే లోకమనుకుని పారిపోయి వచ్చి పెళ్ళి చేసుకున్న సుహాస్ ది.

"ఏయ్! నిన్న! ఏంటి? ఎవరు పట్టుకున్నారు? విడిచిపెట్టండి అంటున్నావు. ఎవడు పడితే వాడికి మెస్సేజీలుపెడితే ఇలాగే అవుతుంది..." కోపంగా అంటున్న ఆ కంఠం అతనిదే! బెడ్ లైట్ వెలుతురులో ఆమె రెండు భుజాలూ గుచ్చి పట్టుకుని అడుగుతున్నాడు భర్త సుహాస్.

భయంగా కళ్ళు తెరిచింది. అప్పటికే వణికి పోతున్న ఆమె మోము మొత్తం చెమటలతో తడిచిపోయింది. ఇంకా వణుకుతోంది విశ్వైక. భయంకరమైన కల. ఆమెకు ఇంకా అది కల అని నమ్మబుద్ధీ కావడం లేదు. కళ్ళ ముందు జరిగినట్లే ఉంది. భర్త వ్యంగ్యపు మాటలు కొత్త కాదు ఆమెకు. భర్త అదిలింపులకు పిల్లలమధ్య నుండి నెమ్మదిగా లేచింది. ఇక ఆ రాత్రంతా జాగరణమే అయ్యింది. మది గతం తలుపు తెరిచింది.

×××××

"ఏయ్!నిన్నే! ఆ మూలుగుడు ఏంటి? పక్కకు పడుకుని నిద్ర చెరిపేస్తావు. నిద్ర లేకపోతే తెల్లవారి లేచి ఆఫీస్ కెళ్ళి నేను ఎలా వర్క్ చేస్తాను అని ఆలోచించవు... లేచి వెళ్లి బయట పడుకో..." పొద్దుటి నుండి పని చేసి చేసి, అలసిపోయి, ఆమెకు తెలియకుండానే మూలిగినప్పుడు, మొట్టమొదటిసారి నిద్రలో ఉండగా, గట్టిగా కొట్టి చెప్పిన భర్త మాటలకు ఉలిక్కిపడింది. బిత్తరపోయింది. అలసిపోయిన ఏ భార్య అయినా, భర్త నుండి కోరుకునేది పైసా కూడా ఖర్చులేని సానుభూతి మాత్రమే. దానికే పొంగిపోయి మళ్ళీ అంతకు మించి పనిచేయడానికి ఉత్తేజాన్ని పొందుతుంది. కాని అదేంటో చాలా మంది మగవాళ్ళకి ఆ విషయమే తెలీదు.

"ఏయ్! నిన్నే! పిల్లలు కొట్టుకుంటుంటే ఏం చేస్తున్నావ్? 'పొద్దుననగా వెళ్లి అలసిపోయి వచ్చాడు', అనే జ్ఞానం ఏమైనా ఉందా?" సుహాస్ మాటలకి కోపం వచ్చింది విశ్వైకకి. గత కొన్ని రోజులుగా రోజు రోజుకూ ఎక్కువవుతున్న భర్త కోపం, ఆమెకంటూ ఓ పేరు ఉందని మరచింది.

"నేనేమీ ఖాళీగా లేను. పొద్దున్న అయిదు గంటలకు లేచింది మొదలు పనితో పరుగు పందెం మొదలవుతుంది నాకు. ఇక్కడ వంట పనిలో ఉన్నా కదా! మీరు చూస్తే తప్పా?"

"పోయి పోయి కష్టపడి వచ్చాడు అనే బాధే లేదు నీకు. వెధవ కొంప, వెధవ సంత అని..."

"నీ పిల్లలు నీకు సంత అయిపోయారా? మీరే కాదు నేనూ పోయి పోయి, కష్టపడే వచ్చాను. పిల్లల ముందు ఇలా గొడవ పడొద్దని తెలీదా?"

"వెళ్లి నాలుగు ముక్కలు చెప్పగానే కష్టపడినట్లా? నాకు ఎన్ని టెన్షన్ లు ఉంటాయి?"

"ఒక్క నాలుగు ముక్కలు చెప్పిందే కనబడుతుందా మీకు? ఇంకా ఎన్ని పనులు చేస్తున్నాను?"

"ఏంటో అవి?"

" పొద్దున్న అందరికీ టిఫిన్లు, మధ్యాహ్నానికి భోజనాలు, సాయంత్రానికి స్నాక్స్ తయారు చేయాలి. పిల్లలిద్దరూ లేవగానే, వారి పనులు అన్నీ చేసి, వారికి తినబెట్టి, హడావుడిగా నేనూ ఇంత కుక్కుకుని, వారికి మధ్యాన్నం తినిపించాల్సిన బాక్స్ లు, సాయంత్రాని కి తినిపించే స్నాక్స్ అన్నీ కలిపి వారిని కేర్ సెంటర్ లో (లాంటి దూరపు బంధువుల ఇంట్లో) పాప ఏడుస్తుంటే, గుండె రాయి చేసుకుని అప్పజెప్పి, బాబును స్కూల్లో దింపి కాలేజీకి పరుగెత్తాలి. అక్కడ క్లాసెస్ చెప్పుకుని, తెల్లవారి చెప్పే క్లాసెస్ ప్రిపరేషన్ చూసుకుని, సాయంత్రం వస్తూ కూరగాయలు తీసుకుని, పిల్లల్ని తీసుకుని ఇల్లు చేరాలి. అప్పటికి పొద్దున్న హడావుడిగా తిన్న టిఫిన్, మధ్యాన్నం చారు, పెరుగు లేకుండా ఏదో తిన్నానంటే తిన్నానన్నట్లు తిన్న భోజనం అంతా ఆవిరై, నీరసం వస్తుంది. ఇంటికి రాగానే వాషింగ్ మిషన్ లో వేయాల్సిన మాసిన బట్టలు, సాయంత్రం, మర్నాడు చేయాల్సిన టిఫిన్ కోసం తయారుచేసుకోవాల్సినవి, దండేలపై మడత పెట్టడం కోసం ఎదురు చూసే బట్టలు... ఎన్ని పనులు? రాగానే పిల్లలకి స్నానాలు చేయించి బట్టలు వేయాలా? తినడానికి పెట్టి, బాబుకు హోం వర్క్ చేయించి,వారిని చూసుకుంటూ రాత్రి వంట చేయాలా! ఇక నేను ఎక్కడ మీకు ఖాళీ గా కనబడుతున్నాను?"

"లోకంలో నువ్వొక్కదానివే ఇవన్నీ చేస్తున్నావా? ప్రతీ పనీ సాగదీసి చెప్పావు. పనిమనిషిని కూడా పెట్టానుగా?"

"కేవలం బయట ఊడ్చి, గిన్నెలు తోమేసి వెళుతుంది. మిగతా పనేమైనా తక్కువ ఉందా?"

"ఇది అందరూ రోజూ చేసేదేగా? ఈ మాత్రం దానికి అలసి వచ్చిన మొగుడిని డిస్టర్బ్ చేయకుండా పిల్లల్ని త్వరగా పడుకోబెట్టాలనే ఆలోచనే ఉండదు. నిద్ర సరిగ్గా లేకపోతే తెల్లవారి ఎలా పని చేస్తాడనే ఇంగితమే లేదు."

ఇక మాట్లాడాలనిపించలేదు ఆమెకు.

అలుపు లేకుండా తిరిగే యంత్రమైనా అతిగా తిరిగితే అరిగిపోవడమో, పాడవడమో తప్పదు. దానికి మనుషులు అతీతులు కారన్నది నిరూపిస్తూ, రోజు రోజుకూ పెరుగుతున్న పని వల్ల, విశ్రాంతి లేకపోవడం వల్ల, నిద్ర తక్కువవడం వల్ల ఒకరోజు కళ్ళు తిరిగినట్లయి, వచ్చేప్పుడు బండి అదుపు తప్పి పడిపోవడంతో, తప్పనిసరయి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు సుహాస్. అక్కడ తెల్సిన విషయం ఆమె గుండెల్ని బద్దలు చేసింది.

"చూడండి సుహాస్! రక్తహీనత, పోషకాహార లోపం, నిద్రలేమితో పాటు కాన్సర్ కూడా ఉంది ఈవిడకి. ఇక నుండి గాజుబొమ్మలా, చాలా జాగ్రత్తగా ఎలాంటి మానసిక, శారీరక ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. ప్రస్తుతం ఉద్యోగం చేయక పోతేనే మంచిది'' అని చెప్పి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి, మందులు రాసి ఇచ్చింది డాక్టరమ్మ .

''ఇప్పటికే ఈ జీతంతో, ఈ భాగ్యనగరమైన మహానగరంలో బతకడం కష్టమంటే, ఇక ఒక్కరి జీతంతో ఈ రోగానికి, మందులకు పెడుతూ ఎలా బతకాలి? బండిపై వస్తుంటే చూసుకోవద్దా? అలా బండి మీద నిద్రపోతావా?" ఇంటికి రాగానే, భర్త నుండి సానుభూతి వచనాలు ఊహించిన విశ్వైక అంచనాలు పటాపంచలు చేస్తూ, భర్త మాట్లాడిన మాటలు విని నిర్ఘాంతపోయింది.

మానసిక స్థైర్యం ఇవ్వాల్సింది పోయి, అంటు వ్యాధిలా ఆమెను దూరం పెట్టడం చూసి ఆమె మనసు కుంగిపోయింది. ఆమె కళ్ళముందు పిల్లల భవిష్యత్తు, తన భవిష్యత్తు ప్రశ్నార్థకమై భయపెడుతోంది.

స్టాఫ్ రూమ్ లో ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా కూర్చుని ఆలోచనల్లో పడిన ఆమె కళ్ళు, ఆ పరధ్యానంలో, బాధలో ఆమెకు తెలియకుండానే కన్నీరు కార్చాయి. అప్పుడే ఆ గదిలోకి అడుగుపెట్టిన ఇంగ్లీష్ లెక్చరర్ శ్రీనివాస్ కంట పడింది ఆమె కన్నీరు.

"మేడం! ఆర్ యు ఆల్ రైట్? ఏమైనా ప్రాబ్లమా?" అతని మాటలకు తుళ్ళిపడిన విశ్వైక, కన్నీరు తుడిచేసుకుని, "అబ్బే! అదేం లేదు" అంది.

"మేడం! మిమ్మల్ని చూస్తే మా చెల్లెలు గుర్తొస్తుంది. అందుకే అడుగుతున్నా! ఏమైనా బాధ ఉంటే ఆత్మీయులతో పంచుకుంటే పోతుంది అంటారు. నాచేతులతో చేయగలిగిన ఏమైనా సహాయం ఏమైనా ఉంటే చేస్తాను. మీకేం అభ్యంతరం లేకపోతే చెప్పండి.'' ఆత్మీయంగా అడిగిన ఆయన మాటలను తీసేసి, ఆయనను బాధ పెట్టాలని లేకపోయినా, ఎవరికీ చెప్పాలనిపించని బాధ చెప్పుకోలేక మాట మారుస్తూ, "ఒకసారి ఆమెను చూడాలని ఉంది సర్" అంది.

"ఈ లోకంలో ఉంటే తప్పక చూపించే వాడిని అమ్మా! మమ్మల్ని కాదని ప్రేమించిన వాడితో వెళ్ళిపోయింది. మోసపోయానని తెలుసుకున్నాక, మొహం చెల్లక అందర్నీ విడిచి శాశ్వతంగా వెళ్ళిపోయింది..." అంటున్న ఆయన కంఠంలో జీర ఆమె దృష్టిని దాటి పోలేదు. షాక్ తింది.

అప్పటి నుండి కాలేజ్ లో అడపాదడపా ఆత్మీయంగా మాట్లాడ్డం, అప్పుడో ఇప్పుడో ఆ కాలేజ్ స్టాఫ్ వాట్సాప్ గ్రూప్ లో మెస్సేజ్ లు పెట్టడం చేసేవాడు.

×××××××

"ఏయ్! ఇంత సేపు ఎక్కడెక్కడ, ఎవడితో తిరుగుతున్నావు?" రాత్రి పొద్దుపోయాక ఇంట్లోకి అడుగుపెట్టగానే కోపంతో ఊగిపోతూ ఒక్కటేసాడు సుహాస్.

"మీరు...మీరు... నన్ను అనుమానిస్తున్నారా? నన్ను కొట్టారా? కోరి చేసుకున్న ప్రతిఫలమా ఇది? పిల్లలున్నారని కూడా చూడకుండా!" కళ్ళల్లో కదలే ఉప్పొంగింది.

"రాత్రయింది. ఇంట్లో ఎదురుచూస్తారు అనే ఇంగితం అయినా లేదా? డిస్టర్బ్ లేకుండాఉండడానికి, సెల్ కూడా స్విచ్ ఆఫ్ చేసి మరీ ఇంత రాత్రి వరకు వెలగబెట్టే రాచాకార్యాలేంటో?"

"ఆఫీస్ లో ప్రిన్సిపాల్ తో మీటింగ్ ఉండటంతో సెల్ సైలెంట్ మోడ్ లో పెట్టాను. ఛార్జింగ్ అయిపోవడంతో స్విచ్ ఆఫ్ అయిపొయింది. కనీసం ఏం జరిగింది? అని బాధపడటం, ఆలోచించడం కాక... ఛీ! ఇలా ఎలా ఆలోచించారు?" చెప్పాలనుకున్నా , చెప్పలేదు విశ్వైక. చెప్పాలనిపించలేదు.

అతను అలా ఆలోచించడానికి కారణం ఆమెకు మరో రెండు రోజుల్లో తెలిసింది.

ఆ రోజు రాత్రి వంటగదిలో ఉన్న ఆమె, ముఖ్యమైన ఒక మెస్సేజ్ పెట్టడానికి సెల్ కోసం బయటకు వచ్చింది. అప్పటికే సుహాస్ చేతిలో ఆమె సెల్ ఉంది. అప్పటివరకు, ఆమెకే తెలిసిన కొన్ని విషయాలు మాటల మధ్యలో సుహాస్ కి ఎలా తెలిసాయో అర్థమైంది ఆమెకు. అంటే ప్రతిరోజూ సెల్ లో వచ్చినవన్నీ చెక్ చేస్తున్నాడన్నమాట. ఛీ! ఎంత నీచమైన పని. అదే తన ముందే అలా చేస్తే తనకు ఏమీ అనిపించేది కాదేమో!

"ఏం చూస్తున్నారు?" ఆమె మాటలకు తొట్రుపడుతూ, "వీడెవడు శ్రీనివాస్? వాడు గుడ్ మార్నింగ్ పెట్టడం ఏమిటి? దానికి నువ్వు సిగ్గుపడుతూ ఈ నవ్వే సింబల్ పెట్టడం ఏంటి? అసలు వాడెవడు, నీకు నవ్వుతూ, గుడ్ నైట్ లు, స్వీట్ డ్రీమ్స్ అంటూ చెప్పడానికి?" కళ్ళల్లో నిప్పులు కురిసాయి.

"మంచిగా మాట్లాడండి. ఆయన నాకు కొలీగ్... గుడ్ మార్నింగ్ అని మాత్రమే చెప్పారు. అయినా ఇలా దొంగతనంగా ఒకరి సెల్ చెక్ చేసే దురలవాటు మీరెప్పటి నుండి చేస్తున్నారు?"

"అంటే చేసిన రంకు (నేరం) బయటపడిందని భయమా? "

"మాటలు చక్కగా రానివ్వండి"

"ఏంటే! నీతో చక్కగా మాట్లాడేది? రోగాల్ని, ఇలాంటి సంబంధాలను దాచి నన్ను చేసుకుని మోసం చేసింది చాలక. పెళ్ళాం అంటే ఎలా ఉండాలో తెల్సా? సతీ సావిత్రి, సతీ సుమతి గురించి చదివావా? కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ అని తెలుసా? నువ్వు చదవవు. నాకు తెల్సు..."

" పెళ్ళాం ఎలా ఉండాలో చెప్పేవాడివి, మొగుడు ఎలా ఉండాలో తెల్సుకున్నారా?

'మాంగల్యం తంతునానేన
మమజీవన హేతునా!
కంఠే భద్నామి సుభగే
త్వం జీవ శరదాం శతం!!'

అంటే నూరు సంవత్సరాలు మెండైన, నిండైన ఆనందం కోసం ఆయురారోగ్యాల కోసం మంగళ ప్రదమైన ఈ మాంగల్యాన్ని నీ కంఠము నందు ధరింప జేయుచున్నాను, అని. జీవితాంతం స్నేహంగా జీవించాలని అగ్ని సాక్షిగా ఏడవ అడుగు వేసారు. అవేమైనా మీరు చేస్తున్నారా?

"అంటే...నేను చేయడం లేదని, నువ్వు నీతి తప్పుతావా? బజారు... ఛీ..."

"ఏం కూసావురా?"

"ఆ...నన్నే రా అంటావా? నిన్ను ..."

కోపంగా ఆమె గొంతు పట్టుకున్నాడు. ఆమె గింజుకోసాగింది. చేతులతో ఎంత విదుల్చుకోవాలని చూసినా అతని బలం ముందు ఓడిపోతోంది. అతని బలానికి వెనక్కి జరుగుతోంది. ఆ క్రమంలో తల, వెనక ఉన్న గోడకు తాకి ఇక జరగడానికి లేక ఆగిపోయింది. అతని బలం ఎక్కువై, అస్సలు ఊపిరి ఆడడం లేదు విశ్వైక కి. ఒక్క సెకన్ అయితే ప్రాణం పోయేదే.

అదిగో, అప్పుడు ఆమెను రక్షిస్తూ సెల్ మోగింది. ఒక్క క్షణం అతని పట్టు సడలేసరికి బలవంతాన లేని బలం తెచ్చుకుని, అతని పట్టు విడిపించుకుని కూలబడింది. శ్వాస తీసుకోవడానికి కొంత సమయం పట్టింది. ఫోన్ తీసుకుని మరో గదిలోకి వెళ్ళిపోయాడు సుహాస్.

ఆ సంఘటన ఊహించనిది కావడంతో భయంతో ఆమె శరీరం వణికిపో యింది. అతని కళ్ళల్లో ఆ క్షణంలో చూసిన క్రౌర్యానికి అతను కోపం వస్తే ప్రాణం తీయడానికి వెనకాడడని తెలిసిపోయింది.

దాని పర్యవసానమే ఈ కల ఏమో!

××××××××××××××

ఆరోజు నుండి ఇంట్లో ముభావంగానే ఉంటున్నారు ఇద్దరూ.

ఒకరోజు ఆఫీస్ లోని కొలీగ్ విరించి ఫామిలీని భోజనానికి పిల్చాడు సుహాస్. వారి ముందు అతను చూపించే ప్రేమకు, అనురాగానికి ఆశ్చర్యపోయింది విశ్వైక.

"ఏం విశ్వైకా! ఆరోజు నువ్వు అందరి ముందు దిష్టి తగులుతుందనే అబద్ధం చెప్పావు కదూ! ఆయన ప్రతి మాటలో నీపై ప్రేమ ఎంత పొంగిపోతోందో చూడు!" విరించి భార్య మాధవి అననే అన్నది.

ఆమెకు అంతకు పూర్వం అందరూ ఫామిలీలతో కల్సి వెళ్ళిన టూర్ లో మాట్లాడుకున్న మాటలు గుర్తొచ్చాయి.

"మా వారైతే నేను లేనిది అస్సలు ఉండలేరు. ఇంతవరకు నాతో తప్ప, విడిగా ఒక్కసారి కూడా ఒక్క సినిమాకు కూడా వెళ్ళలేదు!"

"మా వారు కూడా అంతే. నన్ను విడిచి ఒక్క రోజు కూడా ఉండలేడు!"

"ఆయన వచ్చే వరకు నేను తినకుండా ఎలా ఎదురుచూస్తానో, నేనెక్కడి కయినా బయటకు వెళితే మావారు కూడా అలాగే ఎదురు చూస్తారు. నేనంటే ప్రాణం!"

"అదేంటో! అందరూ చెబుతున్నా విశ్వైక మాట్లాడ్డం లేదేంటో! సిగ్గా..."

"ఆ... వీళ్ళకేం చెప్పేది అనుకుంటుందేమో!"

"దిష్టి తగులుతుంది అనుకుంటుందేమో?"

"ఏం విశ్వైకా? ఏమీ మాట్లాడవు? ఇద్దరూ చక్కగా ముద్దుగా చిలకా గోరింకల్లా ఉంటారు. మేమెంత అసూయ పడతామోనని అనుకుంటున్నావా? నువ్వు చెప్పకపోతే ఇవ్వాళ వెళ్ళనిచ్చేది లేదు. చెప్పాల్సిందే!"

చిలకా గోరింకలు? నిజమే! తాము అవేనేమో?

అందరూ బలవంతం చేయడం తో అబద్ధం చెప్పడం ఇష్టం లేని విశ్వైక నోరు విప్పింది.

"మీరంతా అసూయ పడేంత, అందరి దిష్టి తగిలేంత ప్రేమేం లేదు లెండి!" చిన్నగా దాటేయ బోయింది.

"ఎంత తెలివిగా తప్పించుకుంటున్నావు? మేమేం వదిలేది లేదు!"

బలవంత పెట్టడంతో ఇంతవరకు ఎవరితో పంచుకోని విషయాలలో ఒకటి చెబుతూ, "ఆయనకు పని మీద ఉన్న ప్రేమ, నాపై ఉండదులే!" అంది.

ఆ విషయాలు ఇప్పుడు గుర్తు వచ్చాయి. ఇప్పుడు మొన్న జరిగిన సంఘటన, తను చెప్పినా ఎవరూ నమ్మరని అర్థమైంది. మౌనంగా ఒక వెర్రినవ్వు నవ్వింది.

అదొక్కటేనా! మరో వారానికి ఎవరింట్లోనో పార్టీ ఉందని బయల్దేరదీసాడు. అక్కడ అందరూ సరదాగా, బయటకు అలా షాపింగ్ కి వెళదామని వెళ్ళినప్పుడు, అక్కడ ప్రతీ ఫామిలీలోని పిల్లలకి ఎవరికి నచ్చినవి వారికి కొనిచ్చాడు. ఇంట్లో పిల్లలకు కావాలన్నా, ఏ అత్యవసరవస్తువుల గురించి తెమ్మని చెప్పినా, 'డబ్బులు లేవు' అంటూ చెప్పి, గీచి గీచి ఖర్చు చేసే భర్త అలా ఖర్చు పెట్టేసరికి బిత్తరపోయింది విశ్వైక.

"మీ వారికి పిల్లలంటే ఎంత ఇష్టమో! మీ వారు ఎంత మంచివారో కదా!" అన్న వారి మాటలకు వెర్రి నవ్వొకటి నవ్వింది. సుహాస్ ఆమె వైపు చూసి నవ్విన నవ్వు వెనక ఉన్న వంకర నవ్వు, ఒక్క విశ్వైకకు మాత్రమే కనబడింది. అప్పుడు ఆమెకు అతని గుణం అర్థమైంది. అంటే ఒక్కతన దగ్గర కాకుండా అందరికీ అతని మంచి తనమే తెల్సు. కేవలం తనకు మాత్రమే అతని అసలు గుణం తెల్సు. కాని అతను తెల్సిన ఎవరైనా ఆ మాట చెబితే నమ్మరు. కాదు కాదు. అలా నమ్మించాడు. ఇప్పుడు ఆమెకు ఇంకా భయం ఎక్కువైంది.

ప్రపంచంలో ఎవరైనా ఆదర్శ దంపతులంటే తామే అని చెప్పుకునేలా ఉండాలి తమ జంట అనుకుంది తను. కాని, ఇంత ఘోరంగా మొగుడూ పెళ్ళాలు ఉంటారా? అనేలా ఉన్నారు.

ఇదొక్కటేనా! మానసిక చిత్రవధ అంటే ఏమిటో క్షణ క్షణం కనబడుతోంది. భవిష్యత్తు భూతంలా భయపెడుతుంటే, అనారోగ్యం ఇంకా ఎక్కువైంది. మందులకు అంటే ససేమిరా డబ్బులు ఇవ్వడు.

'మీ ప్రిన్స్ పాల్ కి, నాకు ఆరోగ్యం బాలేదని చెప్పి అడుక్కో' అన్న మాటతో ఆమెకు మనస్సు మొత్తం విరిగిపోయింది. కావాలని వదిలించుకోవాలని ఆలోచిస్తున్నట్లు అర్థమవుతోంది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు.

ఆత్మీయంగా అడిగిన కొలీగ్, సోదరునిగా పిలిచే శ్రీనివాస్ దగ్గర ఏడుస్తూ బయట పడింది.

"నా పరిస్థితి నాకేం అర్థం కావడం లేదు అన్నయ్యా! నేనంటూ లేకుండా పోతే, పిల్లల పరిస్థితి ఏంటి? అనేది కూడా నాకు అర్థం కావడం లేదు. ఆయన మారతారనే నమ్మకము నాకు లేదు"

"లేదమ్మా! ఇలాంటప్పుడు కావాల్సింది మనోధైర్యం. భయపడ వద్దు, భయపడితే ఇంకా భయపెడతారు. బయటకు వెళ్ళినా, చట్టాలు ఆడవారికి అనుకూలంగా ఉన్నాయి. అది గుర్తుంచుకుని, ఆయనకు అర్థమయ్యేలా చెయ్యి" అనడంతో తలూపింది.

అనుకోకుండా వేసుకున్న టాబ్లెట్స్ కొంచెం తేడా చూపించడంతో డాక్టర్ దగ్గరకు వెళ్ళింది విశ్వైక. ఆరోజు డాక్టర్ దగ్గర చాలామంది పేషంట్ లు ఉండటంతో , చూపించుకుని బయల్దేరే సరికి చాలా ఆలస్యం అయింది విశ్వైక కి. ఎప్పటిలాగే సెల్ లో ఛార్జింగ్ అయిపొయింది. ఆమె సెల్ కలవక పోవడంతో సుహాస్ నే వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకోచ్చేసాడు.

××××××××

ఇంట్లోకి వెళ్ళగానే, "ఎన్ని సార్లు చెప్పినా నీ బుద్ధి మార్చుకోవా?" అంటూ కోపంగా చెయ్యి ఎత్తిన అతని చేయిని గట్టిగా తనచేయితో అడ్డుకుంటూ అక్కడే ఆపింది.

"నేనేం తప్పు చేయలేదు. ఎందుకు ఆలస్యం అయ్యిందని అడగాలనే ఇంగితం కూడా లేని మీతో చెప్పడం కూడా అనవసరమే"

"ఆలస్యంగా వచ్చింది కాక అంత పొగరేంటే నీకు? నాకు నచ్చినట్లు ఉంటానంటేనే ఉండు. లేదంటే, ఈ క్షణమే వెళ్ళు"

"వెళతాను. పెళ్ళి చేసుకుంది నీకు బానిసగా బతకడానికి కాదు. నాకూ ఓ వ్యక్తిత్వం ఉంది. అది అమ్ముకోలేదు. కాని వెళితే ఊరికే వెళ్ళను. ఏం చేస్తానో చూడు. నీ వేధింపులన్నీ బయట పెడతాను. చంపాలని చూసిన దానితో సహా. చట్టాలన్నీ నాకే అనుకూలంగా ఉన్నాయి. ఒక్కసారి గృహహింస కేసు పెడితే చాలు. ముందు నువ్వు కటకటాల వెనక్కి. దానితో నీ ఉద్యోగం ఊస్టు. నువ్వప్పుడు కోరలు పీకిన పామువే !"

ఈసారి బిత్తర పోవడం సుహాస్ వంతయ్యింది. ఆమె ఇలా ఎదురు తిరుగుతుందని ఊహించని సుహాస్ దెబ్బ కు ఖంగు తిన్నాడు.

×××××××

ఇలా ఇవన్నీ ఊహించుకుంటూ వెళ్ళిన విశ్వైక అందుకు భిన్నమైన వాతావరణాన్ని చూసి ఆశ్చర్యపోయింది. వెళ్లేసరికి పిల్లలు స్నానాలు చేసి స్నాక్స్ తిని, సుహాస్ చెబుతుంటే బాబు హోం వర్క్ కూడా చేసి, అంతా ఆడుకుంటున్నారు.

"ఏంటి విశూ! ఎటు వెళ్ళావు?"

"హాస్పిటల్ కి" చాలా కాలం తర్వాత భర్తకు గుర్తొచ్చిన తన పేరు విని ఆశ్చర్య పోతూ అంది.

"చెబితే నేను వచ్చేవాడినిగా! ఇంతకూ ఏమన్నారు? నీ ఆరోగ్యం కుదుట పడేంతవరకు రెస్ట్ తీసుకో. నేను కొంచెం ముందు లేచి సహాయం చేస్తాలే " గిచ్చుకుని చూసుకుంది విశ్వైక. నొప్పి తెలిసింది. కల కాదు. ఇన్ని రోజుల పూజలు ఫలించాయని దేవుడికి మనస్ఫూర్తిగా మనసులోనే సర్వస్య శరణాగతి చేసింది. తన మనసుకు అయిన గాయం ఇంత తొందరగా మానుతుంది అనుకోలేదు ఆమె.

విరించికి క్లోజ్ ఫ్రెండ్ అయిన శ్రీనివాస్, విరించి ద్వారా సుహాస్ కి రాబోయే పరిణామాల గురించి చూచాయగా హెచ్చరించి బ్రెయిన్ వాష్ చేసిన సంగతి, కౌన్సిలింగ్ చేసిన సంగతి ఎవరికీ తెలిసే అవకాశమే లేదు .

×××××××

మనతెలుగు కథ లు డాట్ కాం లో బహుమతి పొందిన కథ.

-నామని సుజనా దేవి
7799305575.

> "నేనేం తప్పు చేయలేదు. ఎందుకు ఆలస్యం అయ్యిందని అడగాలనే ఇంగితం కూడా లేని మీతో చెప్పడం కూడా అనవసరమే"

> "ఏయ్! నిన్నే! పిల్లలు కొట్టుకుంటుంటే ఏం చేస్తున్నావ్? 'పొద్దుననగా వెళ్లి అలసిపోయి వచ్చాడు', అనే జ్ఞానం ఏమైనా ఉందా?"

> కోపంగా ఆమె గొంతు పట్టుకున్నాడు. ఆమె గింజుకోసాగింది. చేతులతో ఎంత విదుల్చుకోవాలని చూసినా అతని బలం ముందు ఓడి పోతోంది.

యువ శాస్త్రవేత్త సంజయ్‌కు సత్కారం

సంజయ్ నెక్కంటిని సత్కరిస్తున్న కృష్ణమోహన్‌రావు, ఆకృతి సుధాకర్, దైవజ్ఞశర్మ, తదితరులు.

యువ శాస్త్రవేత్త సంజయ్ నెక్కంటిని తెలంగాణ బీసీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సోమవారం హైదర్‌గూడలో ఘనంగా సత్కరించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకృతి సుధాకర్, పూర్వ సైనికాధికారి మేజర్ జనరల్ శ్రీనివాస్‌రావు, కొత్త వెంకటేశ్వర్‌రావు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

అక్కడక్కడా

మాటల పోపులను
మూగ చెవిలో వేస్తూ
అంధకారపు ఆటల క్రీడలో
అక్షరాలను రాస్తూ
లేని పోని అనుమానపు
అంటు మొక్కలను పెంచుతూ
నమ్మకం లేని జీవిత
అంతరాలను ఉసిగొల్పే
అజ్ఞానాంధకారులు...
అక్కడక్కడా కొందరుంటారు !

బలం కోసం బలగం కోసం
తోడ్పాటు చేసే జనులకు
డబ్బులను ఎరగా వేసి
అధికార పీఠం కోసం
పేరు ప్రఖ్యాతుల కోసం
బహుముఖ పాత్రలతో
పాకులాడే నాయకులు...
అక్కడక్కడా కొందరుంటారు !

అవినీతి వస్త్రాన్ని ధరించి
కుటిల బుద్ధులను కలిగి
అధికార దాహం కోసం
నూతన ముసుగులు ధరించి
వాగ్దానాల కోరికల
కొవ్వొత్తులను వెలిగిస్తూ
మేక వన్నె పులులు
వెంపర్లాడే మునులు
అక్కడక్కడా కొందరుంటారు !

తాత్కాలికమైన అశాశ్వతమైన
నగ్నదేహపు తెరలు కొన్ని
హంగు ఆర్భాటాల కోసం
నిస్వార్థమైన మనసు లోగిళ్లలోకి
హరివిల్లుల సోపానాలు వెదజల్లే
అనాలోచిత ఆర్భకులు...
అక్కడక్కడా కొందరుంటారు !

-డాక్టర్ పగిడిపల్లి సురేందర్
8074846063

గెలుపు పునాది

అపజయానికి సిద్ధ పడితేనే..
విజయ ద్వారం దొరికి తీరు..
గెలుపుకు నమ్మకమే పునాది !

సదాలోచనలు స్వచ్ఛందంగా రావు
ఈగల్లా గుంపులా ముసురుకోవు
ముక్కోటి చీమల దండులా పాకవు
ఆకాశంలో నల్లని కాకుల్లా ఎగిరిరావు !.

రాజహంసల్లా విజయాలోచనలు..
అరుదుగా తాకును మనసుకు
తాకినపుడే ఒడిసి పట్టి గెలువు !

క్షీరసాగర మధనం చివర్లోనే కదా..
ఉబుకును విజయామృతం ధారలు
శక్తి, యుక్తి సమాహారాలే హర్ష చప్పట్లు !

భయాన్ని భయపెడితేనే జయాలు
శ్వేదంతో ప్రతికూలతల్ని పారద్రోలితేనే..
వసంత కోకిల విజయ శంఖారావాలు !

భయపడితే ప్రగతి రథం ఆగిపోయి..
ప్రతికూలతలు పగలబడి నవ్వును..
ఎదురు తిరిగితే పిల్లుల్లా తోక ముడుచు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మనుషుల తీరు

దూరపు కొండలు
నునుపు అన్న చందం..
దూరం దూరంగా ఉంటేనే
మనుషుల మధ్య ప్రేమలు,
అనురాగ ఆత్మీయతలు..
దగ్గరగా ఉండ వలసి వస్తే
మాత్రం ఈర్షా ద్వేషాలు..!

దూరం దూరం ఉంటేనే
కొండంత ప్రేమలు
దగ్గరికొస్తే మాత్రం
అసూయ అసహనాలు.!

దూరం లో ఉంటే తొండల్లా
తలూపుతారు..
దగ్గర లో చేరువయితే
ఊసరవెల్లిలా మారుతారు!

మబ్బుల్లో మెరుపుల్లా
సముద్రంలో కెరటాల్లా
ఈ ఆత్మీయతానురాగాలు
క్షణ బంగురాలు
రంగుల బొంగరాలు!

అంతా మాయా జాలం
ఆత్మీయ అనురాగాలకు
చెల్లిందీ కాలం.!
ఈర్షా ద్వేషాల నడుమ
అసూయ అసహనాలతో
వెళ్ళ

కళ ఎంత ప్రాంతీయమయితే అంత అసలుదవుతుంది-నీలమణి ఫూకన్

సాహిత్యసంతి



-వారాల ఆనంద్
9440501281

వ్యక్తీకరణ ఎంత అంతర్ముఖీనమయితే అంతగా స్వచ్ఛమవుతుంది (ముక్తకం)

ఇది సరిగ్గా ఈశాన్య భారత రాష్ట్రాల సాహిత్యానికీ, సినిమాకూ, సంగీతానికీ అన్ని కాళాత్మక రూపాలకూ వర్తిస్తుంది. అక్కడింకా ఇప్పటికీ సహజ సిద్ధమయిన నదీ నదాలూ పర్వతాలతో పాటు మనుషుల అనుభవాలూ, వ్యక్తీకరణాలూ మిగిలి వున్నాయి. అందుకే అక్కడి సాహిత్యం గొప్ప భావ స్ఫోరకంగా వుంటున్నది. సంగీతమూ సినిమాకూడా అంతే గొప్పగా కొనసాగుతున్నది. అట్లా ప్రకృతి సిద్ధమయిన చెట్లూ, అడవులూ, ఆకుపచ్చదనమూ పర్వతాలూ కలుషితం కాని వాతావరణంతో తుల తూగే ఈశాన్య భారతంలో ప్రధాన రాష్ట్రం అస్సాం. అక్కడినుంచి వచ్చిన సాహిత్యం, సంగీతం, సినిమామొదలు అన్ని కళలూ అత్యంత ప్రాంతీయమై, భావస్ఫోరకమై ఎలాంటి అనుకరణలు లేకుండా చాలా వరకు ఆసలయిన కళారూపాలుగా వుంటున్నాయి.

ఈశాన్య భారతం అత్యంత ప్రాచీనమయిన సంస్కృతికి పతిరూపం . 200కు పై చిలుకు జాతుల సమాహారమయి దాదాపు ప్రతి జాతీ తమదయిన విశిష్ట భాషా సంస్కృతుల్ని కలిగి వుంది. అందులోనూ ఉమ్మడి అస్సామ్ రాష్ట్రంగా వున్నప్పటినుండీ అస్సాం భాషా సాహిత్య, సినిమా రంగాల్లో జాతీయ అంతర్జాతీయ దృష్టినీ ఆకర్షించింది. భూపేన్ హజారికా, బబెంద్రనాథ్ సైకియా లాంటి అనేక మంది సంగీతకారులూ, నీలమణి ఫూకన్, హేమ బారువా, అమూల్య బారువా, మహేశ్వర్ నియోగి లాంటి అనేక మంది కవులు వెలుగొందారు. రచయితలూ తమ తమ సృజనాత్మక రంగాలతో పాటు అస్సామి సినిమా రంగంలో కూడా విశేషంగా కృషి చేసి అస్సామి సినిమాను నిలబెట్టారు.

అట్లా అస్సాం నుండి ఎదిగి వచ్చి అఖిల భారత స్థాయిలో తనదయిన ముద్రను వేసిన కవి నీలమణి ఫూకన్.

"మానవుడు ఎదుర్కొన్న అన్ని సంక్షోభ కాలాల్లో కవిత్వం బతికే వుంది వుంటుంది కూడా" అంటాడు సుప్రసిద్ధ ఆస్సామి కవి నీలమణి ఫూకన్. భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారం 'జ్ఞానపీఠ్', సాహిత్య అకాడెమి పురస్కారాలతో పాటు అనేక పురస్కారాలు, విశిష్ట సత్కారాలూ అందుకున్న ఆయన "నాకు వచ్చిన అవార్డులూ, రివార్డులూ చూసి నేనేదో సాధించానని అనుకోను.. ప్రపంచ వ్యాప్తంగా వెలువడ్డ లక్షలాది కవితల్లోకి నేనూ కొన్నింటి చేర్చాను" అంతే అంటాడు. అట్లా అత్యంత వినమ్రంగా ప్రకటించుకున్నా ఆయన ఇటీవలే జనవరి 19 న గౌహతి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో మృతి చెందారు. 1933 సంవత్సరంలో సెప్టెంబర్ 10 నా జన్మించిన ఆయన ప్రకృతి ప్రేమికుడు. జోర్హాట్ పట్టణానికి చేరువలో వున్న దేర్గావ్ లో జన్మించాడు. సహజ సిద్ధమయిన అందమయిన వాతావరణాన్ని సంతరించుకున్న ఆ ప్రాంతమది. అంతే కాదు తేయాకు తోటలతోనూ చుట్టూరా పర్వత సానువులతోనూ నిండి వున్న అక్కడి వాతావరణం నీలమణి ఫూకన్ పైన చిన్ననాడే గొప్ప ప్రభావాన్ని చూపింది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆయన పైన చిన్నప్పటినుండీ తన తల్లిప్రభావం తో పాటు అప్పటికే సాహిత్య జర్నలిస్టు రంగాల్లో ప్రసిద్ధుడయినా తన చిన్నాన్న ప్రభావం అమితంగా వుంది. చుట్టూ వున్నా వాతావరణంతో పాటు భాషా సంస్కృతుల ప్రభావం వల్ల నీలమణి కి జానపద సాహిత్యం పాటలు, గిరిజన జనజీవితం పైన అభిమానం మక్కువ పెరిగాయి. అవన్నీ తన సృజనాత్మక జీవితంలో ప్రతిబింబించాయనే చెప్పాలి. కవిగానే కాకుండా గిరిజన జానపద కళల విమర్శకుడిగా కూడా ఆయన ఎదగడానికి చిన్ననాటి ఆ ప్రభావాలు ఎంతగానో దోహదపడ్డాయి. అందుకే ఒక చోట ఆయనంటాడు "నేను కనుక ఈ అస్సాం లోని సుతిమెత్తని ఆకుపచ్చ వాతావరణం లో పుట్టి ఉండకపోయి వుంటే..ఈ గ్రామీణుల భాష నంస్కృతి, ఆటా పాటలతో మమేకం అయివుండక పోయివుంటే.. ప్రాచీన, వర్తమాన కవుల రచనల సాంగత్యమే నాకు దొరకక పోయివుంటే నేనసలు కవినే అయివుండేవాన్ని కాదు. నేను యాభై ఏళ్లకు పైగా పట్టణాల్లో నివసించినప్పటికీ ఇప్పటికీ నాకు పల్లె స్మృతులు, కలలు,సుఖమూ దుఖమూ,, ఇంకా పల్లెల వాసన, రుచీ, రంగూ ఇంకా నన్ను చుట్టుకునే వుంది. ఎప్పటికప్పుడు నన్ను కదిలిస్తూనే వుంది"

1950 లలోనే కవిత్వం రాయడం ఆరంభించిన నీలమణి ఫూకన్ అప్పటికే అస్సాం సాహిత్య ప్రపంచంలో తమదయిన ప్రభావాన్ని రచిస్తున్న గొప్ప కవులు హేమ బారువా, అమూల్య బారువా, మహేశ్వర్ నేయోగ్ లాంటి కవుల ప్రభావంలో తన రచనలు ఆరంభించాడు. వాళ్ళు అప్పటికే ఆరంభించిన ఆధునిక కవితా ఒరవడిలో తాను తన రచనలు చేయడం ఆరంభించాడు. నీలమణి తో పాటు ఆ కాలంలో రచనలు చేసిన కవులు నవకాంత బారువా, అజిత్ బారువాలు కూడా అదే రీతిలో కవిత్వ రచనలు చేసారు. నీలమణి ఫూకన్ కు రుషి లాంటి కవి అన్న పేరు కూడా వుంది. ఎందుకంటే ఆయన తాను ఎన్నుకున్న విస్తారమయిన కాన్వాస్, ఎంచుకున్న భాష రాసిన తీరు ఆయన్ని అట్లా పిలవడానికి దోహద పడింది. ఆయన తన కవిత్వంలో చెట్లు, పర్వతాలూ,మైదానాలూ, నీళ్ళూ నిప్పూ, గ్రహాలూ, నక్షత్రాలూ, అడవులూ ఎడారులూ అన్నీ ఆయన్ని ఒక రుషి లాంటి కవి అనిపించాయి. ఆయన కవిత్వం లో అధికంగా సాధారణ విషయాల్ని చెబుతున్నట్టు అనిపించినప్పటికీ అయన అనేక అంశాల్ని మనిషి కేంద్రీకృతంగా నే చెప్పారు. "మరణానికి అర్థాన్ని, జీవితంలోని ఖాళీలని" గురించీ రాసాడు. అట్లా విస్తృత అధ్యయనం విస్తారమయిన రచనల ద్వారా నీలమణి ఫూకన్ అస్సాం సాహిత్యం లో సుస్థిర మయిన స్థానాన్ని పొందడం తో పాటు భవిష్యత్తరాలకు మార్గనిర్దేశంచేసే రచనలు చేసాడు. ఆయన సృజనలో ఫ్రెంచ్ ప్రతీకవాద ప్రభావం అధికంగా కనిపిస్తుంది. ఆరు కవితా సంపుటాలు వెలువరించిన నీలమణి ఫూకన్ జపనీస్, చైనీస్ కవితానువాదాలు రెండు, కొన్ని స్పానిష్ కవి గార్సియా లోర్కా కవితానువాదాలూ చేసాడు. ఆయనకు దృశ్య కళ లలో విపరీత ఆసక్తి వుండేది. ముఖ్యంగా పెయింటింగ్స్ లో నీలమణి కి ఆసక్తే కాకుండా గొప్ప పెయింటింగ్స్ పైన ఆయన చాలా రాసాడు.

నీలమణి ఫూకన్ మొట్ట మొదటి కవితా సంకలనం "సూర్య హెనో నామి ఆహే నడి ఏడి"(నది ఒడ్డున సూర్యోదయం) 1963 లో వెలువడింది. అయితే నీలమణి తన అనంతర ప్రచురణల్లో మొదటి ప్రచురణ నుండి కొన్ని కవితల్ని మినహాయించాడు. అంటే ఆయన ఎప్పటికప్పుడు తన రచనల్ని పునర్ మూల్యాన్వేషణం చేసుకునేవాడన్నమాట. తనరెండవ కవితా సంకలనం " నిర్జనతర్ శబ్ద" (నిశబ్ద ధ్వని) 1965 లో వెలువడింది. తర్వాత 1968 నీలమణి తన మూడవ సంకలనం "ఆరు కిను శబ్ద(నిశబ్దం అంటే ఏమిటి) వెలువరించారు. తన తొలి రచనలే అయినప్పటికీ అవన్నీ అస్సామి ఆధునిక కవితా ధోరణులకు అద్దం పట్టాయనే చెప్పాలి. అయితే నీలమణి కవిత్వం లో ముఖ్యమయిన మలుపు తిరిగిన కవిత్వం 972 లో ఆయన వెలువరించిన "ఫులి తోక సూర్యముఖి ఫుల్తోర్ పాలే (వికసించే పొద్దు తిరుగుడు పువ్వు కోసం). ఇందులో ఆయన సిరీస్ గా రాసిన కవితలు అస్సామి ఆధునిక కవిత్వం మీదా తీవ్ర ప్రభావాన్ని కలిగించాయి. విషయ పరంగా సాహసోపేత మయిన అంశాల్ని తీసుకోవడంతో పాటు కవితా నిర్మాణ విషయం లో కూడా ఆయన అనేక ప్రయోగాల్ని చేసాడు. అయన ఈ కవితల్లో మరణానికి సంభందించి, ఒంటరితనానికి సంబదించి ప్రతీకలని మళ్ళీ మళ్ళీ వాడడంతో పాటు,కవి తన ఒంటరితనాన్ని, సంక్లిష్టమయిన తన ఉనికిని కూడా విరివిగా రాసాడు. అట్లా రాసిన కవితల్ని చదివినప్పుడు పాఠకుడు తమ మనస్సుల్లోకి అంతరంగాల్లోకి వెళ్లి పోయే స్థితి కూడా కలుగుతుంది. ఈ అకవితల్లో నీలమణి ప్రతీకాత్మక వాదాన్ని స్ఫుటంగా వాడాడు. అనేక ప్రతీకలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. మళ్ళీ మళ్ళీ చదివించి ఆలోచనల్లో పడేస్తాయి. అంతేకాదు ఫూకన్ తన కవితల్లో జానపద ప్రతీకలని వాడతాడు. దాంతో ఒక స్థానీయత కనిపిస్తుంది. ఆయా సందర్భాల్లో ఆయా మాటలకు కొత్త అర్థాల్ని సంతరింప చేయడం నీలమణి ఫూకన్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అనేక దశాబ్దాల పాటు సాగిన ఆయన కవితా రచన ఆయనలోని విచక్షతని చాటుతుంది. వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ లోతయిన, విస్తారమయిన సున్నితత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

నీలమణి ఫూకన్ 1961 లో గౌహతి విశ్వవిద్యాలయం నుండి చరిత్ర లో ఎం.ఏ. చేసాడు. 1964 నుండి గౌహతి లోని ఆర్య విద్యాపీఠ్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసాడు. ఆయనకు 1981 తన కవిత సంకలనానికి సాహిత్య అకాడెమి అవార్డు లభించింది. 1997లో అస్సాం వాలీ లిటరరీ అవార్డు అందు కున్నారు, 1990 ఆయనకు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందించింది. 2021లో ఆయనకు జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

'కవిత్వం మనిషి లో సున్నితత్వాన్ని పెంచుతుంది, మానవీయతను సంతరింప చేస్తుంది, సోయిని పెంచుతుంది,సృజనాత్మకతను పెంచి మంచేదో చెడేదో వాటి మధ్య ఉన్న రేఖా మాత్ర తేడాను తెలుసుకునేలా చేస్తుంది, స్పందించే గుణాన్ని విస్తరింపచేసి ప్రకృతిలోకి చూసేలా చేస్తుంది,అందుకే మనుషులు అంతా కవులూ, ప్రేమికులూ, లేదా తిరుగుబాటుదారులయినా కావాలి'. అంటాడు నీలమణి ఫూకన్.

> "నేను కనుక ఈ అస్సాం లోని సుతిమెత్తని ఆకుపచ్చ వాతావరణం లో పుట్టి ఉండకపోయి వుంటే..ఈ గ్రామీణుల భాష సంస్కృతి, ఆటా పాటలతో మమేకం అయివుండక పోయివుంటే.. ప్రాచీన, వర్తమాన కవుల రచనల సాంగత్యమే నాకు దొరకక పోయివుంటే నేనసలు కవినే అయివుండేవాన్ని కాదు. నేను యాభై ఏళ్లకు పైగా పట్టణాల్లో నివసించినప్పటికీ ఇప్పటికీ నాకు పల్లె స్మృతులు, కలలు,సుఖమూ దుఖమూ,, ఇంకా పల్లెల వాసన, రుచీ, రంగూ ఇంకా నన్ను చుట్టుకునే వుంది. ఎప్పటికప్పుడు నన్ను కదిలిస్తూనే వుంది"

ఎవరయితే చదవరో వారికోసమే 'కవిత్వం'

ఓ కవి అన్నాడు
'ఎవరయితే చదవరో వారి కోసమే కవిత్వం'
హృదయాల్లోని గాయాల కోసం
ముళ్ళుదిగి ముడుచుకు పోయిన చేతి వేళ్ళ
వేదన కోసం సంతోషం కోసం
బతుకుతున్న వారి కోసం చనిపోయిన వారి కోసం
రాత్రీ పగలూ రోడ్లమీద కేకలు వేస్తూ దొర్లే వారికోసం
ఎడారి సూర్యుడి కోసం
చావు అర్థం తెలుసుకోవడం కోసం
బతుకులోని అర్థాలు తెలియడం కోసం
కోమలమయిన పెదాల నడుమ
కనిపించే ఎరుపు వర్ణం కోసం
ముళ్ళ కంచెపై రెక్కలు విచ్చుకున్న పసుపు రంగు
సీతాకోక చిలుక కోసం
కీటకాల కోసం, నత్తల కోసం, నాచు కోసం
మిట్ట మధ్యాహ్నం నిప్పు నీడల ఉద్వేగంలో
ఆకాశం నుంచి ఒంటరిగా దిగి వచ్చే పక్షి కోసం
రోగాలూ ఆకలితో అలమటిస్తున్న
అయిదు కోట్ల మంది పిల్లల తల్లుల కోసం
ఎరుపుగా మారిపోతానన్న భయంతోవున్న చంద్రుడి కోసం
ప్రతి స్థబ్ద క్షణం కోసం
ఎప్పటికప్పుడు మలుపులు తిరుగుతున్న ప్రపంచం కోసం
మట్టిలో పుట్టి మట్టిలో కలిసి పోయే
ఆ మనిషి కోసం
ఆ పాత సూక్తి

-ఆస్సామి మూలం: నీలమణి ఫూకన్
ఇంగ్లిష్: ప్రదీప్ ఆచార్య





నేను-నేను చూసిన మూడుతరాల 'స్త్రీ'

మారుతున్న సమాజంలో తరానికి తరానికి అంతరాలు, మార్పులు కనబడుతున్నాయి. ఆ మార్పులు ఆయా సమాజపు దర్పణాలుగా గోచరిస్తాయి. నేను చూసిన మూడు తరాల అంతరాలను మీ ముందుంచే చిరు ప్రయత్నం. మా అమ్మమ్మ తరం, మా అమ్మ తరం, నా కూతురి తరం?

అమ్మమ్మ తరం

నేను నా చిన్నతనాన్ని అమ్మమ్మ (అనసూయమ్మ) దగ్గరే గడిపాను. అప్పటి ఆర్థిక పరిస్థితులు, చుట్టూ ఉన్న విభిన్న ప్రజల ప్రవృత్తులు, మనుషుల కల్మిడి వ్యక్తిత్వాలు, ఆహారపు అలవాట్లు, తెలియనివి తెలుసుకుంటూ ఉండే బాల్యం నాది. కుటుంబాల మధ్య ప్రేమానురాగాలు, ఒకరికొకరు అనే మనస్తత్వాలు, పెద్దలపట్ల గౌరవభావం, మన సంస్కృతిని ఆచరించే విధానం, నేను గమనిస్తూ పెరిగాను. అడిగినవారికి లేదనకుండా సహాయ గుణం ఉండేది. స్త్రీలు శారీరకదారుఢ్యంతో ఎక్కువ సంతానాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి, తమ బిడ్డలకు ఐదు సంవత్సరాల వరకు తల్లిపాలతో పెంచేవారు. ఉమ్మడి కుటుంబాల మధ్య విశాల హృదయంతో, కష్టించే గుణాన్ని కలిగి, అత్తగారి నుండి మన వళ్లదాకా భిన్న మనస్తత్వాల మధ్య, అతి ఆశలు లేక సంతృప్తికరమైన జీవనాన్ని గడిపేవారు. 12నుండి 15సంవత్సరాల మధ్య వివాహాలు ఎక్కువ జరిగేవి. ఎంతటి పరిస్థితుల లోనూ మనోధైర్యంతో జీవితాన్ని సాఫీగా గడిపేవారు. వ్యవసాయ కూలీ పనులకు వెళ్లే కుటుంబాలలో స్త్రీ పురుషులు ఇరువురు సమఉజ్జీలుగా పని చేసేవారు. ఇంట్లో పెత్తనం మగవారిదైనా, సలహాలు ఇవ్వడంలో మంత్రి పాత్రను పోషించేది. నిస్వార్థమైన వీరి ఆలోచనలు ఆరోగ్యకరంగా ఉండి జీవన గమనానికి పూలబాటలు వేసేవి. ఆస్తిని సంరక్షించుకోవడానికో లేక తమ వారిని పోషించుకోవడానికి, తమ కుటుంబం మనోధైర్యం కోల్పోకుండా నేనున్నానని ఆపన్న హస్తం అందించడానికి పెంపకం పోవడం(దత్తత) అనేది సర్వసాధారణ విషయం. తెలంగాణ ప్రాంతంలో నైజాం పాలన మూలంగా స్త్రీలు అభద్రతగా ఉండి అన్యాయాలకు గురి అయిన వారు కొందరైతే, ఇంకొందరు ఎదిరించి పోరాడిన వీర వనితలు ఉన్నారు. ఆహార విషయంలో వరి అన్నం కన్నా ఎక్కువ గంజి, గటక, నూకలను ఉపయోగించేవారు. అవి యంత్రాల ద్వారా ఆడించకుండా, దంపుడు బియ్యం ఎక్కువగా ఉపయోగించేవారు. అవి ఆరోగ్యానికి శరీరానికి పుష్టిని ఇచ్చేవి. సాత్విక ఆహారాన్ని భుజించేవారు. స్త్రీలు భర్త, పిల్లలు, కుటుంబంలోని వారు ఆరగించిన తర్వాతనే తాను భుజించేది. పాడి పంటలు సమృద్ధిగా ఎవరికి వారే చూసుకునేవారు. పెద్దల సలహాలను పాటిస్తూ,జీవితావసరాలను తీర్చుకునేవారు. అక్కడక్కడ వేశ్యవృత్తిని చేసే దేవదాసి కుటుంబాలు ఉండేవి. పండగలు అనగానే ఎన్ని సంబరాలు. మన సంస్కృతి కొట్టవచ్చినట్లు ఉండేది. 'పంచుకుంటేనే ప్రేమ పెరుగుతుందని' అందరూ సామూహికంగా సంబరాలు జరుపుకునేవారు. మగ పిల్లవాడు పుడితే వంశాంకురం పుట్టిందని ఎక్కువ సంతోషించేవారు. స్త్రీకి చదువు విషయంలో పట్టించుకునేవారు కాదు. ఉత్తరం చదివే చదువు చాలని 12,13సంవత్సరాలకే పెళ్లిళ్లు చేసేవారు. వ్యవహార జ్ఞానములో మగవారికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. కులవృత్తులకు ప్రాధాన్యత ఇచ్చి, జీవనాధారాలుగా మలుచుకునేవారు. 'ఆడవారి మాట పెదవి దాటకూడదు, కాలు గడప దాటకూడద'నే హద్దులు పెట్టి వేష, భాష, మనుగడలో స్వాతంత్ర్యాన్ని ఇచ్చేవారు కాదు. కొన్ని స్వతంత్ర భావాలు ఉన్న, ఉమ్మడి కుటుంబాలలో వ్యక్తం చేయలేక న్యూనత భావాలతో ఒదిగిపోయి ఉండేవారు. సంప్రదాయాలకు ప్రతీకలుగా కట్టుబొట్టు ఉండేవి. డబ్బు వ్యవహారంలో అంతగా లేక దాస్య రూపంలో వస్తు మార్పిడిలను నేను చూశాను. అమ్మమ్మ వడ్ల గింజలు పెడితే, పప్పులో, పళ్ళు, వాళ్లకు పండినవి ఇచ్చేవారు. సంవత్సరానికి కారు (పంటకి) ధాన్యాన్ని ఇస్తే, పండక్కి సాలెవాడు బట్టలు, కుమ్మరి వాళ్లు కుండలను, చాకలివాడు బట్టలు ఉతకడం, మంగలి క్షవరం ఇలా చేసి పోయేవారు. కులవృత్తులు కుంటుపడకుండా ఒకరినొకరు సంరక్షించుకునేవారు. వీరి జీవన ప్రమాణాలు కూడా ఎక్కువే. 90 సంవత్సరాలు పైబడిన ముసలివారు కూడా వారి పనులు వారే చేసుకుంటూ, వారు కాలక్షేపం కొరకు మన సంస్కృతిని చాటి చెప్పే భారత, భాగవత పఠనం చేసేవారు.జానపదకళారూపాలు ప్రదర్శించేవారు.

అమ్మతరం

మా అమ్మకి, నాకు 20 సంవత్సరాల వ్యత్యాసం. భావాలు ఒకే విధంగా ఉండేవి. చదువుకు ప్రాధాన్యం అప్పటినుండే ప్రారంభమైనది.' ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు' అనే భావనతో ఉండేవారు. భర్త సంసార బాధ్యత వహించినప్పటికీ భార్య చేదోడు వాదోడుగా ఉండేది. ఒకరికొకరు గౌరవించుకునేవారు ఒకరిపై ఒకరికి నమ్మకం ఉంచుకొని జీవనాన్ని సాగించేవారు. ఉమ్మడి కుటుంబాలకే ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఈ తరం స్త్రీలు కూడా నిస్వార్థంగా ఉండేవారు. చదువుకున్న స్త్రీలు 30 శాతం ఉండేవారు. కుటుంబంలో ఒకరు వాళ్ళ పిల్లల చదువుల గురించి పట్టించుకుంటే, వేరొకరు వంట పని చేయడం, మరొకరు ఇంటి పని చేసేవారు. పని భారాన్ని పంచుకున్న అందరూ కలిసి ఒకేసారి భుజించేవారు. అత్తమామలని తల్లిదండ్రులుగా భావించేవారు. చిన్న వయసులో అత్తారింటికి రావడం వల్ల మమేకమై అత్తమామకు అలాంటి ఆప్యాయతలను గౌరవాన్ని ఇచ్చేవారు. వారు తమ పిల్లలకు అందించే ప్రేమను వాళ్లపై చూపించేవారు. వారి కుటుంబంతో సంబంధం ఉన్న ప్రతి వ్యక్తులపై గౌరవ మర్యాదలు కనబరిచేవారు. ఏది వండినా, ఏది పొందిన అందరికీ సమానంగా పంచే హృదయం వారికుండేది. అగ్రకులాల స్త్రీలు చదువుకున్నవారైనా సమన్యాయానికే మొగ్గు చూపేవారు. వారి ఆచారాలు సంస్కృతులను మరవక దాని ప్రచారానికై కూడా ముందుం డేవారు. పాపభీతి, దైవప్రీతి, సంఘరీతి, ఎక్కువగా ఉండేది. వారి సంతానానికి అవి చదివించేవారు. పోటీ తత్వము కూడా పెరిగింది. నాగరికత పేరుతో అప్పుడప్పుడే పాశ్చాత్యపు పోకడను అనుసరించే పద్ధతులు వచ్చాయి. సినిమా చూడడం, నవలలు చదివేవారు. ఇంటిలో ఏదో ఒక పుస్తకం ప్రతివారు చదివే విధంగా పరిస్థితులను కల్పించేవారు. (చందమామ పుస్తకాలు) జానపద కళల ద్వారా మన సంస్కృతిని ప్రచారం చేసేవారు. వాటిలో కూడా స్త్రీలు పాల్గొనేవారు. వాటి ప్రభావం జీవనశైలి మీద ఉండేది. అలాంటి జీవితాలను ఆదర్శంగా జీవించేవారు, అనుసరించేవారు. వాస్తవాలకు దగ్గరగా ఉండేవి. ఆనాటి సినిమా కథలు వేషధారణలోను మార్పు వచ్చింది. ఒకరిని ఒకరు అనుసరించేవారు. కుటుంబంతో గడపడానికి ప్రాముఖ్యతను ఇచ్చేవారు. తర్వాతే సంఘ సేవకు ఉపక్రమించేవారు. గౌరవ మర్యాదలు ఎక్కువగానే ఉండేవి. అక్కడక్కడ బాల్య వివాహాలు జరిగినప్పటికీ అవి హానికారకంగా లేకుండెను. వ్యవసాయ కుటుంబాలలో స్త్రీలకు కొంత విశ్రాంతిని ఇవ్వడానికే ముగ్గు చూపేవారు. కష్ట పరిస్థితులలో స్త్రీ పురుషునితో పాటు పొలానికి వెళ్లి భర్తకు సహకరించేది. చాకచక్యంతో వ్యవహార బాధ్యతలతో చేదోడువాదోడుగా ఉండేది. వారికి కొత్త ఆశలు చిగురించిన, అవి వారికి అందుబాటులో ఉండే కోరికలే కావున అవి తీర్చుకొని తృప్తిగా ఉండేవారు. నెరవేరని కోరికలు ఉండేవి కావు. అందుకే మూడు పువ్వులు ఆరుకాయల్లా వారి జీవిత రథం సాగేది. నివాసాలు ఏర్పరచుకొని కుల,మత బేదాలు లేకుండా సమ సమాజంలో మెలిగేవారు. అగ్రకులాలలో కొంత భావన ఉన్న, వారి ఆలోచనలను గౌరవిస్తూ మిగతావారు ప్రవర్తించేవారు. ఎవరి హద్దుల్లో వారు ఉంటూ సమైక్య భావనతో ఉండేవారు. కుల వృత్తులను పెద్దలు గౌరవించేవారు. చిన్నవాళ్లు ఉద్యోగఅన్వేషణలో ఉండేవారు. వాడవాడలలో గ్రామంలో సంబంధాలు పెంచుకొనుటకు అక్క, వదిన, అన్నా, అంటూ సంబోధించుకునేవారు. సంఘంగా ఏర్పడి ఒకరి భావాలనో సలహాలను గౌరవిస్తూ జీవితాలకు ఉపయోగించుకునేవారు. అటు గౌరవిస్తూ, సంస్కృతిని కొన్నింటిని నిరసిస్తూ ఉండేవారు. అలాంటి వాతావరణంలో పెరిగిన బాలికలు కూడా కొత్తదనాన్ని అవలంబించుకుంటూ గౌరవ మర్యాదలకు భంగం వాటిల్ల కుండా మసలుకునేవారు. ఆధ్యాత్మిక భావనలు కూడా ఉండేవి ఆయా పండగల ప్రాముఖ్యత వైశిష్ట్యాన్ని తెలిసి ఉన్నవారే ఎక్కువగా ఉండేవారు. ఉన్నత పదవులు స్త్రీలు అధిరోహించేవారు. మొత్తం మీద స్త్రీ పురుషులు సమానులే అన్న భావము ఆనాటి సమాజంలో కనిపించేది.

నా కూతురితరం...

భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసే పరిస్థితులలో ఉన్నది ప్రస్తుత సమాజం. పిల్లల క్రమశిక్షణతొ తల్లిదండ్రుల మార్గంలో పెంచుతున్నప్పటికీ, కొంత వయసు రాగానే పిల్లల అభిప్రాయాలను గౌరవిస్తున్న రోజులు ఇవి. నేటి సమాజంలో భర్తతో పాటు, భార్య నాలుగు రాళ్లు సంపాదిస్తేనే జీవనం సాఫీగా నడిచే పరిస్థితి. దానికి తగిన చదువుకై వివాహానంతరం కూడా స్త్రీలు చదువుకుంటున్నారు. చదువు లేకపోయినా జీవనాధారం కోసం వారి ఆశలు నెరవేర్చుకొనుటకు పనులను చేస్తూ పైసలు సంపాదించుకుంటున్నారు. ఇంటిపని, వంటపని, బయటి పని ఇలా మూడు రకాలైన ఒత్తిడితో అనేక రకాలైన మానసిక వైకల్యాలకు కారణం అవుతున్నారు. తృప్తి లేని జీవనాన్ని గడుపుతున్నారు. సుఖం లేని నిద్రలు గడుస్తున్నాయి. దీనికి కారణం శక్తికి మించిన ఆశలు కోరికలు కొంత అయితే, తృప్తి లేని భావన కొంత. ఈనాటి స్త్రీలలో వాళ్ళింట్లో చేసుకున్న వంటలు అందరూ తినాలనే తపన ఉండేది. అలాగే పంచుకునేవారు కొంత స్వార్థం, కొంత విశాల హృదయంతో మసలుకునేవారు. అవసరాలను బట్టి దూర దూరంగా నివసించిన, పండగలకి పబ్బాలకి అందరూ ఒకే చోట జరుపుకునే వారు. అందరూ కలిస్తేనే పండగ అనే భావనలో ఉండేవారు. కుటుంబంలో ఏ ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించిన, ఉన్నత ఉద్యోగం సంపాదించిన, అందరూ సమభావనతో ఒకరికొకరు అన్ని విధాలా సహకరించుకునేవారు. మూఢాచారాలపై ఉద్యమించిన స్త్రీలు లేకపోలేదు. ఒక పెద్దవారి చేయూత వారికి అనివార్యమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి పరచుకొని జీవితాన్ని సాఫల్యం పొందిన బాలికలు ఎందరో, నిర్ణయాలు తీసుకోవడంలో వీరికి ధీటు ఎవరూ లేరు అన్నట్లుగా ఉంటాయి. ఆ ధైర్యంతో అడుగులు ముందుకు వేస్తున్నారు బయట తిరుగుతున్నారు. కావున ప్రత్యక్షంగా చూసి ఆలోచించగలిగిన సామర్థ్యం ఉంటుంది. వీరిలో తమ నిర్ణయం సరియైనదనే భావనతో ఆ మాటపై నిర్భయంగా నిలబడే దృఢ చిత్తం వీరిది. కొన్ని సందర్భాలలో వారికి ఎదురైన కష్టనష్టాలకు వారే బాధ్యులన్న ఆలోచన కొంత కొరబడింది. ఆహార విషయంలో శరీరాకృతిపై దృష్టి ఎక్కువ. సరియైన సమయానికి ఆహారం తీసుకొనక, శారీరకంగా విశ్రాంతి లేక, మానసికంగా బలహీనులవుతున్నారు. డైటింగ్ అని మితాహారం తీసుకుంటూ ఒకవైపు, పాశ్చాత్య పోకడలతో బయట తిండి పిజ్జా, బర్గర్ తిని ఇంకొందరు మరొకవైపు శరీరాన్ని తగ్గించుకుంటున్నారో, పెంచుకుంటున్నారో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. మాటలతో బూరెలు వండగలరు(అందరిలో కలిసిపోగలరు). మాటలతో గుండెలను బాధ గలరు (ఎదురేగి మాట్లాడగలరు) ఈ రెండింటిలో సమ ర్థులు నేటి బాలికలు. ఏ సమయానికి ఏ వేషధారణ చేయాలో తెలిసిన వీరు అటు పాశ్చాత్యము ఇటు మన సంస్కృతిని మేళవింపులుగా ధరిస్తారు. సమయానుకూలంగా వస్త్రధారణ ఉంటుంది.

సామాన్య స్త్రీ నుండి దేశ ప్రధాని వరకు స్త్రీ అందలము ఎక్కింది. అంచెలంచెలుగా స్త్రీ స్థితిగతులలో మార్పు సంభవించింది. అయినప్పటికీ కొన్ని సమస్యలు పోయి కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. బాల్య వివాహాలు పోయి బలవంతపు వివాహాలు, కన్యాశుల్కం పోయి వరకట్నాలు, స్త్రీవిద్య సమస్య పోయి ఉద్యోగస్తులైన స్త్రీల సమస్యలు, స్త్రీకి స్వేచ్ఛ లేకపోయే సమస్య పోయి లైంగిక వేధింపులు, న్యూనతా భావాలు ఇలా ఎన్నో సమస్యలను ప్రతినిత్యం ఎదుర్కొంటూనే ఉంది. దీనిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ఉంది. ఒక తల్లిగా, ఒక కూతురుగా, ఒక భార్యగా పాత్రలను పోషిస్తూ ఒక స్త్రీ మార్పు తీసుకొని రాగలదు. ఎలా అనగా స్త్రీ వివక్షతకు గురికాకుండా కుటుంబాలలో పని విభజన చేసుకునే విధంగా చూడాలి. ఈ పని ఒత్తిడి వలన మానసిక రుగ్మతలకు గురి అవుతున్నారు. పురుషుల నిర్ణయాలను పాటించడం, నీడలా అనుసరించక స్వతంత్ర భావాలను వ్యక్తం చేస్తూ ఒకరికొకరు అర్థం చేసుకుంటూ కుటుంబంలో సమ ప్రాధాన్యతను పొందే విధంగా అనుసరించాలి. మన వ్యక్తిత్వాన్ని గౌరవించుకుంటూ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. వివక్షతకు గురవుతున్న మన సామర్థ్యాలను మెరుగు పెట్టుకుంటూ మనల్ని మనం నిరూపించుకోవాలి. ఇది చేయలేం అనక, ఏదైనా సాధించగలమనే పట్టుదలతో పని చేయాలి.

ఉపాధ్యాయినులు బాలికల్లో న్యూనతా భావాన్ని పోగొట్టి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. చదువు, ఆటపాట ఇలా ప్రతి పనిలో ప్రోత్సహించాలి. విజయం సాధించిన మహిళల వీరగాథలను చెప్పి, జ్ఞానాన్ని నింపి వారిలో సృజనాత్మకతను మేల్కొల్పాలి. ఆడపిల్లల తల్లులతో సంబంధాలు కలిగి, చదువులో ప్రోత్సహించి చైతన్య పరచాలి. వారిని జాగృతం చేయాలి. పిల్

'అల్లం పద్మ యాదిలో...' 'అమ్మ' పుస్తకావిష్కరణ

ఫిబ్రవరి 22న టూరిస్ట్ ప్లాజాలో జరిగిన 'అల్లం పద్మ యాదిలో...' ప్రథమ వర్ధంతి సంస్మరణ సభలో "అమ్మ" పుస్తకం ఆవిష్కరణలో అల్లం నారాయణ, యం. లక్ష్మయ్య, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్, జూపాక సుభద్ర, అల్లం రవళి, డా॥ అల్లం భావన, మేరిమాదిగ, తిరునగరి దేవకీదేవి, అల్లం రాజయ్య, రమేశ్ హజారి, అస్మాని మారుతీసాగర్ తదితరులు.

'కార్పేటినగరం కథలు' పుస్తకావిష్కరణ

ఈనెల 25న ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన 'కార్పేటినగరం కథలు' బాలల బొమ్మల పుస్తక ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ రామ్ పురుషోత్తం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర, బాల సాహితీ వేత్త డాక్టర్ ఎమ్.హరికిషన్, ఆల్ ఇండియా రేడియో విశ్రాంత అధికారి ఎ.మల్లేశ్వర రావు, సాహితీ ప్రియులు ఆర్.ప్రభాకర్, గాజుల నాగేశ్వర రావు, నాగరాజు నాయక్, బి.చెంగల్రాజు తదితరులు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 783వ రోజు 'ఆధునిక మహిళ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఆధునిక మహిళ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

అన్నింటా తానై

పుడమి పై
ఎన్ని ఉపద్రవాలూ ఉప్పెనలూ
ముంచెత్తినా
ఎన్ని మానవ మృగాలు
విశృంఖల చర్యలు చేసినా
ఓర్పుతో భరిస్తున్న ఆ తల్లి ధరణియే
మహిళలందరికీ ఆదర్శం కాదా....?
పరదా ఆంక్షల నుండి
పక్షిలా గగనపు అంచులను తాకింది
పలుచన చేసిన చోటునే
పంకజమై అలరారింది
నిత్యం ఎన్నో ఒత్తిడులు
అయినా వెరువదులే ఏనాడు
ప్రతి నిమిషం, ప్రతి చూపు సవాలే...
అయినా జంకదులే ఏ క్షణం
అంతరిక్షానికెగిసినా
సమసిపోలేదులే అంతరం
నేటికీ
సంపూర్ణ స్వేచ్ఛలేని ఆశాకిరణం
మహిళలూ,మహారాణులంటూ
పెట్టే ముళ్ళ కిరీటాలే
పెద్ద పీట వేస్తామంటూనే
అవకాశం కోసం చూసే గుంట నక్కలే
సమ సమాజ మంటూనే
మంట పెట్టే వారు మరికొందరు
ఆధునిక మహిళని పేరే గానీ
అందులో కొందరి బతుకులు
బుద్ధుధప్రాయమే
ఎంత మారినా
ఏది మారినా
అంతరాంతరాలలో అణిచివేతనే
నిత్యం అష్టావధానాలెన్నో చేసినా
ఏ గండపెండేరాలు ఆమెను వరించవు
అహో,ఒహో మహిళ
అనడమే
సభలూ,మెప్పులూ
పైకి కనబడే ఆర్భాటాలు కాదు
అర్థం చేసుకుని
ఆదరించడం కావాలి
అర్థరాత్రైనా
ఏ గాలీ సోకకుండా
గమ్యం చేరడం కావాలి
అన్నిటా తానైనా
ఆత్మ సంతృప్తి లేదులే.

-పురం మంగ

ఆది నుండి అనంతం దాకా

ఆది నుండి అనంతం దాకా
స్త్రీ లేని జగతి లేదు
తక్కువ అంచనా వేయకండి ఆమెను
నింగి నేలా అంతటా తానే
తరతరాల సంస్కృతి సంప్రదాయాలకు
మూల స్తంభం ఆమె
ఆధునిక మహిళ అనంత కృషి
అన్నిటా తెస్తుంది కీర్తి
ముల్లోకాలకు మూలపుటమ్మగా
మూల స్తంభాలై
కూలీ అయినా
కులీనురాలైనా
రైతైనా రౌతైనా
రాష్ట్రపతి అయినా
రాష్ట్రాన్ని ఏలినా
ట్రెక్కింగ్ చేసినా
ట్రక్కు డ్రైవర్ అయినా
సంతోషాన్నిచ్చినా
సముద్రంలో ఈదినా
సైన్యంలో సిపాయియైనా
ఉన్నతాధికారిణి అయినా
దేశాన్ని ఏలినా
దేశ భద్రతను కాపాడే
ఉద్యోగిని అయినా
జరుగుబాటు లేక జాలరి అయినా
ఆటపాటల్లో
ప్రావీణ్యం సంపాదించినా
సంగీత సాహిత్యాలలో
సాటిలేనిదైనా
పురుషులకు దీటుగా
స్త్రీ శక్తికి ధీశక్తి జోడించి
ఆది నుంచి అనంతం దాకా
నేనే సాటి-నాకెవ్వరు పోటీ
అంటూ ధీమాగా పలికే
ఆధునిక మహిళా!
నీకు వందనం!
జై మహిళా!
జై జై మహిళా !!

- మన్నె లలిత

వెలిగి పోతున్నది

ఎప్పుడు లేచిందో ఎలా లేచిందో
మహిళా లోకం నిద్ర లేచింది
చీకటి గుహలోనీచి బయటి కొచ్చింది
స్వేచ్ఛా గాలి పీల్చి ఒళ్ళు విరుచుకునీది
సినీహమై జూలు దులిపింది
అబలను కాదు
సబలనని మునీదు కురికింది
మగవాడితో సమానమని
సవాల్ విసిరింది
అన్నినీటిలో నేను ఉన్నానని
ఎన్నినీటినో అధిగమించినీది
అబ్బుర పెట్టినీది
ఆశ్చర్య పరిచింది
చదువు రాదన్న అమాయక అబల
చరిత్రను తిరగ రాసింది
నేవీలో తానే ముందు నిలిచింది
ఆకాశానికి ఎగిరింది
వ్యోమగామయ్యింది
చదువుల్లో ఆటల్లో రాజకీయాల్లో
బాక్సింగ్ లో కుస్తీల్లో
ఆధునికమహిళ అందరిని మించింది
అబ్బో! ఆధునిక మహిళ
రాజ్యాలు ఏలినీది
రణరంగమెక్కింది
రుద్రమ అయ్యింది
చట్ట సభల్లో
శాసన విధుల్లో
సాంస్కృతిక సభల్లో
సంగీత వీధుల్లో
ఆధునిక మహిళ
వెలుగొందుతున్నది
వెలిగి పోతున్నది.

-కందుకూరి మనోహర్



అన్నింటా ఆమే

ఆధునిక మహిళ
అన్నింటా ముందే ఈవేళ
తెస్తుంది ఏ రంగానికైనా కళ
తానున్న తావే తళతళ
కాలు మోపితేనే భళా.
అంతరిక్షాన్ని అలరించినా
గగన తలాన విహరించినా
వసుధపై వాయు వేగాన వెళ్ళినా
అంబుధిని హాయిగ ఈదినా
సమర రంగాన మెరిసినా
దేశాన్ని దీటుగ ఏలినా
ఇంటా బయటా నెగ్గుకు రాగలిగినా
పసి మొగ్గలను పుష్పాలుగా తీర్చిదిద్దినా
సంస్కార బీజాలను దేశానికందించినా
విదేశీ భూభాగాలను పాలించినా
ఆధునిక మహిళకే సాధ్యం
ఆ తరువాతే మనమందరం
ఆధునిక మహిళకు అభివందనం.

- జె.వి.కుమార్
చేపూరి

భళా భళా!

నేటి మహిళామూర్తి
సర్వరంగాలలో అరితేరిన కీర్తి
ప్రేమలో త్యాగమూర్తి
ప్రేమించిందంటే జీవితమే రక్తి
పరిశోధన
విద్య
రక్షణ
వైమానిక
అంతరిక్ష రంగాల్లో
ఆధునిక మహిళ భళా భళా
విశ్వానికే కళ కళ
కుటుంబానికి తళ తళ
అంకురంలో నవ్య పంథా
అన్వేషణ ఆవిష్కరణ లలో
ఆధునిక మహిళ ఘనత.
ఏమీ విస్మయం? వింత?
అదే అదే
ఆమె అపూర్వంగా
ప్రగతి సాధించింది కొండంత
ఇంత విశిష్ఠతలు ఉన్నా
సాధికారత సగటున సున్నా
ఆధునిక మహిళ
క్రీడలలో ముందంజ
అంతర్జాతీయ పోటీలలో అగ్రగామి
పురుషులకు దీటుగా సవాళ్లు.
అంతర్జాతీయంగా పోటీ
పలు కష్టాలు దాటి
చిరు ధాన్యాల ఉత్పత్తిలో మేటి
స్వయం సహాయక బృందాలు
ఇస్తున్నాయి ఆర్థిక సంస్థలకే ఋణాలు.
పొదుపును అలవాటుతో
జీవనోపాధికి అభయం
కల్పిస్తున్నారు
ఆధునిక మహిళలు
దేశానికే తలమానికం
అవుతున్నారు .

-ఆర్.ప్రవీణ్



సకల కళాస్వరూపిణీ!

మహి అంతటికీ ప్రకాశమిచ్చే
మణిదీప్త శక్తిస్వరూపిణీ!
మహిమాన్విత మహిళా!
నీకు వందనం.
సత్సంప్రదాయాలను పరిరక్షిస్తూనే
సాధికారతకై పోరాడుతున్న
సాలోచనల సాధ్వీరత్నమా!
నీకు వందనం.
గృహకార్యాలను నిర్వహిస్తూనే
విద్యారంగంలో
విపణి లోకంలో
అంతరిక్షపు బాటల్లో
సాగర గహనాంతర సీమల్లో
అంతర్జాల ప్రపంచంలో
విహరించి విస్మయం గొలిపే
హంసయానా!
నీకు వందనం.
పాకశాస్త్ర ప్రావీణ్యంలో
విజ్ఞాన పరిశోధనా రంగంలో
ప్రథమస్థానంలో ఉన్న పడతీ!
నీకు వందనం.
వ్యవసాయమైనా
వ్యవహారమైనా,
కళారంగమైనా
కదనభూమియైనా
కరతలామలకమే కదా నీకు
కలకంఠీ!
అందుకో వందనం.
అమ్మదనంలో
ఆటల మైదానంలో
పరిపాలనారంగంలో
అందరి మన్ననలందుకుంటూ
అరువదినాలుగు కళలనూ
కైవసమొనర్చుకుంటూ
అందరికీ స్ఫూర్తి నిస్తున్న మహిళా!
నీకు వందనం...అభినందనం!.

- ముద్దు వెంకటలక్ష్మి

అష్టావధానం

శాంతం,క్షమ,ప్రేమ,ఆప్యాయత
మమతానురాగాల
ప్రియరాగాలు పలికిస్తూ...
లోకరీతుల్ని
ఎదుటి మనసు లోతుల్ని
అవలోకనం చేసుకుంటూ
నిష్ఠూరాలు,హేళనలు
ఛీత్కారాల నాగటి పోట్లను
పుడమితల్లిలా సహిస్తూ
ఇంటిపనితో,బయటిపనితో
కుటుంబబాధ్యతలతో
వృత్తిపరమైన ఆందోళనలతో
అనారోగ్యంతో
సతమతమవుతూ
అనుకోని సమస్యలు
పృచ్ఛకుల్లా ఎదురైనా
అష్టావధానం చేసి మెప్పిస్తూ
పసిడిజింక రూపం దాల్చిన
మారీచుల నుంచి
కాటు వేసే కాలభైరవుల నుంచి
చాకచక్యంగా,లౌక్యంగా
తప్పించుకుంటూ
మనుగడ సాగిస్తోంది
ఆధునిక మహిళ!!!.

-చంద్రకళ దీకొండ

ఆరాట పోరాటం

ఆధునిక మహిళకి
ఆకాశమే హద్దు
కాదు...
ఆకాశంలోకే దూసుకు పోగల
తెగువ ధైర్యం ఆమె సొంతం
ఎందరో మహానుభావుల
కృషి ఫలితం నేటి మహిళ
తనకు చదువున్నా లేకున్నా
తన బిడ్డ ఉన్నత స్థితిలో ఉండాలని
పరితపించే తల్లులెందరో
కూలీనాలీ చేసైనా
బిడ్డభవిష్యత్తుకి
బంగారు బాట వేస్తుంది
ప్రాచీన కాలంలో
పురుషులతో సమాన స్థాయి
మధ్యయుగంలో
అణచి వేతకి గురి
నేటియుగంలో సంస్కర్తల
కృషి ఫలితం
సమాన హక్కులు
మహిళజీవితం
అనేక సంఘటనల సమాహారం
ఒడిదుడుకులు దాటుకుని
ఉన్నత శిఖరాల చేరిక
ఆధునిక యుగంలో
ఆధునిక మహిళకి
ఆత్మస్థైర్యమే తోడు
ఏ రంగంలోనైనా రాణించు
నేల మీద కార్లు
నింగిలో విమానాలు
తేలిగ్గా నడపగల సామర్థ్యం.
మాతగా సమాజ నిర్మాత
కుటుంబానికి ఆర్థికంగా
వెన్నుదన్నుగా...
వృత్తి పరమైన నైపుణ్యం
అందరికీ ఆదర్శం
ఆధునికత ఆహార్యంలో కాదు
ఆలోచనల్లోఉండాలి
ఆచరణలో ఉండాలి
అప్పుడేకుటుంబ విజేత
సామాజిక విజేత
ప్రపంచ విజేత కాగలరు.

-మోటూరి శాంతకుమారి

అన్నింటా తానైనా...

ఎక్కడ మొదలు పెట్టాలీ
ఏమని చెప్పేదీ
కర్పూరమై వెలుగుతున్నరు
ఆధునిక మహిళలు.
చరితకు దివిటీలు వెలిగించినా
భవితకు పూల బాటలేసినా
జ్ఞాన శిఖరాలు అధిరోహించినా
మేధోమథన పోరాటం
తప్పడం లేదు
లింగ వివక్షకు
అమ్మగా అబల గురౌతూనే ఉంది
మనసు ఒంటికన్నురాకాసి చూపులో
వేధింపు చర్యలు కొనసాగుతున్నై.
సుపారీల సునామీలు
ర్యాగింగుల ఆత్మహత్యలు
భర్తల చాటున రాజకీయాలు
ఆధునిక సమాజానికి తలవంపులే
సవాళ్ళు ఏ కాలానికైనా కొత్త కాదు
మార్పు కోసం పోరుబాట పట్టి
సాహసమే ఊపిరిగా బతకాలి
లక్ష్యం దిశగా ముందుకు సాగాలి
ఆకాశయానం చేసినా
అంతరిక్షంలోకి అడుగుపెట్టినా
ఆకాంక్షల హరివిల్లు ఆవిరౌతుంటే
జ్ఞాన సరస్వతిగా
సాగిపోవడమే మేలు.

-ఏడెల్లి రాములు

మహిళలూ... వర్ధిల్లాలి!

ముదితలు నేర్వని
విద్య లేదు.
అన్ని రంగాలలో
నేటి ఆధునిక మహిళ
దూసుకు పోతోంది
బస్సుల్లో రైల్వేలలో ఉద్యోగం
విమానాలు, రైళ్ల డ్రైవింగు
సైన్యంలో చేరి దేశ రక్షణ కోసం
పహారా
సముద్రాలను సైతం అవలీలగా
యీదేస్తున్నారు
సాధారణ ఆఫీసుల్లోనూ
ఉద్యోగాలు చేస్తూ దర్శనమిస్తున్నారు
కుటుంబాలను పోషించడంలోనూ
వారిపాత్ర అమోఘం..
ఓరిమి సహనంలో మేటిగా
ఉపాధ్యాయినిలు గా ఉద్యోగాలు
బ్యాంకుల్లోను వారిదే ఆధిపత్యం
శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ
మహిళలదే పైచేయి.
విశ్వంలో దేశ ప్రధానులుగా
అధ్యక్షురాళ్ళుగా చలామణి
అకుంఠిత దీక్షతో ఎవరెస్టు ను సైతం
అవలీలగా అధిరోహణ
దేశంలో ఎందరో మహిళలు
కలెక్టర్లు.
అసెంబ్లీలలో, పార్లమెంట్లో కూడా
మహిళలదే పైచేయి
మంత్రి మండళ్లలో కూడా
మంత్రులుగా చక్రం
మహిళలూ! వర్ధిల్లాలి మీరు
మీకు మీరే పోటీ కావాలి నేడు....

- శనగపల్లి
ఉమామహేశ్వరరావు

రాలుతున్న, "ప్రీతి" సుమాలు



నీ ప్రాణం పుష్పం పాదాల కింద
నలగకముందే పోరాడు
నీ ఆత్మస్థైర్యం జాడలు
అడుగంటక ముందే
ఆరాట పడు
వంటింటి నుండి
నెట్టింటకు వచ్చిన నీ తెగువ
మానసిక స్థైర్యాన్ని నట్టింట
మునగ నీయకు.
ఓ మగువచెదరి పోనీ ఓటమి నీది
చిన్న కారణాలకు బెదిరి పోయి
ఉసురు పోనివ్వకు
కాపాడే ఒక జీవితం
పాడె గా మారితే
పడి లేచిన తరంగానివై
పడగ విప్పి ఒకసారిరా
కులాన్ని కబళించిన అమానుషత్వం
మానవత్వాన్ని మరచి
కుహనా సంస్కారుల నీడలో
కళేబరమై మొలచినా
కొత్త పంథా నింపుకొనిరా
చదువుల తల్లి
"ప్రీతి" పాత్రమై జనారణ్యంలో
జాతి రత్నమైమెరిసిన కదలికకుతంత్రపు.
మెదళ్లలో సలిగిన మెదళిక
మేముకోల్పోయింది. ప్రాణాలను పొసే భవిష్యత్తును,
ఒక ఉషస్సునుస్వేచ్ఛ
ఇవ్వలేని అసమానతలరుగ్మతలను
బాగు చేయలేకపాదం వెనుకడుగు వేసిందారాజకీయ
నాటకీయ చదరంగంలో
పావులు పావులుగా పారాడుతూనేవుంటాయి.
మద గజముల చీల్చి చెండాడు
అశ్వమధిరోహించి ఎదురొడ్డి
కదలాడుచట్టాల చుట్టాల
కబంధ హస్తాల మధ్య
ఏ అండ దండలు లేని బ్రతుకు.
వ్యస్తములో ఆత్మ న్యూనతను బంధించు
అస్త్ర శస్త్రాలు సంధించు.

-డా॥సముద్రాల శ్రీదేవి
9949837743

ప్రీతి లేని లోకం!

తలచుకుంటే అన్నం మీద ప్రీతి కలగదు
నీళ్లు తాగలనే ప్రీతి లేదు
ప్రీతి లేని లోకంలో ప్రీతి అనిపించదు.
ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందని డాలర్ అంత సంబరం మనకు !
చుట్టూ సమాజం కిరాతకంగా అరణ్యం సుమా !
గాలిలో దీపం పెట్టి రెండు చేతులూ అడ్డు పెట్టి తంటాలు పడుతున్న నిత్య దినచర్య
ఆడపిల్లంటే అగ్గి పెట్టెలా
ఆరుద్ర పురుగు లెక్క లోకువా !.
ప్రీతి నువ్వు 10 వ తరగతి వరకు చదివి
ఇంట్లోనే ఉంటే సరిపోతుందే !
అకాల హత్యా అమానుష మారణ హోమానికి
అదృశ్యమయేదానివి కాదు !
అయినా మనకు మన తండాలో ఏం తక్కువ ?
మట్టి తడిగా ఇక్కడ బంగారం
బిడ్డా ! డాక్టర్ చదువు చదువుతూ శవమై వస్తివి !
పల్లెలే పదిలం !
మాయదారి మహా నగరాలు నరకం !
ఎందరు ఓదారుస్తే ఏం ?
తిరిగి వస్తవా ప్రీతి !
ఇప్పుడు మన ఊరి భూమాతకు ప్రీతి అయినవు
ఎవరి కన్ను పడని మట్టిల మెట్టినవు.
ఆడపిల్లను సదివించకున్నా కష్టమే
సదివిస్తే యమ గండమే !
ఆలస్యమయే శిక్షల బెయిలు వ్యవస్థలో
దోషులు దొరలౌతారు !
గిట్లనే ఆడపిల్లలకు ఆపదల సదువులు.
గట్టిగా పేనిన ఊరితాళ్లు జైల్లలో
గురక పెట్టి వదులౌతున్నయి!
హంతకులు క్షమా భిక్షలతో ఊరేగుతున్నరు
మా సువర్ణ అక్షరాల భారత రాజ్యాంగమా !
కఠినాతి కఠిన శిక్షలు ఉక్కు కలంతో శాసనం చేసి
ప్రపంచ రాజ్యాంగల ముందు
ప్రీతిగా పట్టాభిషేకం చేసుకో!
ప్రీతికి ఇదే ఆత్మశాంతి !

-కందాళైరాఘవాచార్య
8790593638

కవులు సమాజ మార్గదర్శకులు-జిల్లా అదనపు పాలనాధికారి జీ.వి. శ్యాం ప్రసాద్ లాల్

కవులు సమాజ మార్గదర్శకులని జిల్లా అదనపు పాలనాధికారి జీ.వి. శ్యాం ప్రసాద్ లాల్ గారు అన్నారు. ఆదివారం నాడు ఫిలిం భవన్ లో భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడిన జాతీయ కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాన్ని నిర్వహించి... ఓ కవితా సంకలనాన్ని వెలువరించిన డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అభినందనీయులని అన్నారు. చౌదూరు నరసింహారావు గారి "ఆణిముత్యాలు", డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ గారి స్వీయ సంపాదకత్వంలో "విశ్వంభరుడు", మంచి కట్ల భాస్కర్ గారి "కిక్" పుస్తకాలను సభలో ఆవిష్కరించారు.

విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖకవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ సమకాలీన సంఘటనలపై కవులు స్పందించాలని కోరారు.

సమాజహిత అంశాలను ఎంపిక చేసుకుని కవిత్వాన్ని రాయాలని సూచించారు. ప్రారంభ సభలో పాల్గొన్న మరో విశిష్ట అతిథి ప్రముఖ కవి సాధనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడు తూ... కవులు అధ్యయనంపై దృష్టి సారించి, గాఢమైన కవిత్వం రాయాలని కోరారు. భాష పై అవగాహన పెంచుకుని తమ రచనలు చేయాలని కోరారు. భవాని సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొమ్మకంటి కిషన్ స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు, మాడుగుల సూర్యనారాయణమూర్తి, చౌదూరు నరసింహారావు మూడు ఆవృతాలకు అధ్యక్షత వహించిగా, వెల్ముల జైపాల్ రెడ్డి,బుర్ర విజయలక్ష్మి నాగరాజ్, జనశ్రీ జనార్దన్ కవి సమ్మేళనాలకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం మూడు గంటలకి డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ముగింపు సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న

తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ నన్నయ్య నుండి నారాయణ రెడ్డి దాకా కవనమూర్తులపై కవిత్వం రాయించి ఓ సంకలనాన్ని వెలువరించడలో సంపాదకులుగా వైరాగ్యం చూపిన చొరవ అభినందనీయమని అన్నారు.

కవిత్వం రాయడంలో సమకాలీన సంఘటనలకు చోటు కల్పించాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమి అనువాద పురస్కార విజేత వారాల ఆనంద్ మాట్లాడుతూ అధ్యయనం పై దృష్టి సారించి తమ కలాలకు పదును పెట్టుకోవాలని సూచించారు. కవులు బాధ్యతతో తమ కవిత్వాన్ని రాయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వెలువరించిన "కవితామూర్తులు" కవితా సంకలనాన్ని వారాల ఆనంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబై ప్రాంతాల నుండి దోమల జనార్దన్, కె.వి.ఎస్.గౌరీపతి శాస్త్రి,గుండవరం కొండలరావు, మాడుగుల నారాయణ మూర్తి, దేవరాజు రేవతి, మోటూరి నారాయణ రావు, తంగెళ్ళపల్లి ఆనందాచారి,జనశ్రీ జనార్దన్, లేదాళ్ళ రాజేశ్వర రావు, బొమ్మకంటి కిషన్,ఎర్రం రాజారెడ్డి, నగునూరి రాజన్న,లోడె రాములు,దూత రామ కోటేశ్వరరావు, కనకయ్య మల్లముల, పోతుగంటి వీరాచారి,గుండు రమణయ్య, మానస, సాయి తేజ మొదలైన అరవై మంది కవులు పాల్గొన్నారు. పాల్గొన్న కవులను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

ఉత్తమ కవి స్థానం ప్రజాహృదయాల్లో

-తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి

ఉత్తమకవి ప్రజాహృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాడని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు నిర్వహణలో రవీంద్రభారతిలో ఫిబ్రవరి 26న జరిపిన సాహిత్య తరగతిలో ఆయన ప్రధానవక్తగా ప్రసంగించారు. 'కవిత్వ రచన-మౌలికాంశాలు' అనే అంశంపై ప్రముఖ కవి డా. అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన ఈ సాహిత్య తరగతి నిర్వహించారు. కొత్తగా ఆలోచించడం కవికి తప్పనిసరి అని సిధారెడ్డి సూచించారు. విభిన్నంగా చెప్పగలగడం ఉత్తమ కవికి ఉండే సుగుణంగా ఆయన పేర్కొన్నారు. వస్తువు, శిల్పం కవిత్వానికి అత్యంత ప్రధానమైనవని ఆయన చెప్పారు.

కవులు అధ్యయనాన్ని వీడకూడదని సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు చౌదారపు శ్రీధర్ అన్నారు. సమకాలీన సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు.

కవులు రాజ్యంలో ఉండకూడదని పేర్కొన్న కాలం నుండి కవిత్వం నేటివరకు పురోగమన పథంలో సాగిందని సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు, కాళోజీ అవార్డు గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్ అన్నారు. కవిత్వంపై వివిధ తత్వవేత్తల అభిప్రాయాలను ఆయన సోదాహరణంగా వివరించారు. సృజనను నిరంతరం కొనసాగించాలని ఆత్మీయ అతిథి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పి. సరోజినీదేవి కవులకు సూచించారు. అభ్యాసం వల్లే ఉన్నత స్థితికి చేరగలుగుతారని ఆమె పేర్కొన్నారు.

దర్పణం సాహిత్య వేదిక కవులతో ప్రతిరోజూ ఒక అంశంపై కవిత్వం రాయించి, అభ్యాసానికి వీలుకల్పిస్తోందని ఆ సంస్థ అధ్యక్షులు డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు చెప్పారు. 'నేటినిజం' దినపత్రిక సౌజన్యంతో ప్రతి వారం ఒక అంశంపై పదిమంది కవులు రాసిన కవితలను ప్రచురించడం జరుగుతోందని ఆయన వివరించారు. సాహిత్యంపై అవగాహనం కల్పించేందుకు ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పి. వి. సత్యమూర్తి, రామకృష్ణ చంద్రమౌళి, గుర్రాల వేంకటేశ్వర్లు కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. జాలిగామ నరసింహారావు, జె. వి. కుమార్, నక్క హరికృష్ణ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కవిసమ్మేళనంలో గిర్మాజి దామోదర్, సాదనాల వెంకటస్వామి నాయుడు, సత్యవీణ మొంద్రేటి, కోదాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల గోపన్న తెలుగు వారందరికీ ఆరాధ్యులు



బండ శ్రీనివాస్, కళా జనార్దనమూర్తి, కేవీరావు, గుదిబండి వెంకట్‌రెడ్డి తదితరులు.

భక్త రామదాసుగా ప్రసిద్ధి పొంది వందల కీర్తనలు రచించిన కంచర్ల గోపన్న తెలుగు వారందరికీ ఆరాధ్యులని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో కంచర్ల గోపన్న జయంతి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భద్రాచల రామాలయం స్థాపన కోసం తొలి బీజం వేసిన రామదాసు ప్రభుత్వ పన్నులు తహసీల్దార్‌గా వసూలు చేసి ఆలయ నిర్మాణానికి వెచ్చించి కష్టాల పాలయ్యారని చివరికి రామలక్ష్మణులు వచ్చి నవాబుకు డబ్బు చెల్లించారని చెబుతూ.. అంతటి రామభక్తుడు గోపన్న అని కొనియాడారు. గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. దక్షిణ భారత వాగ్గేయకార ప్రముఖుల్లో ఒకరని కీర్తనలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ఘంటసాల గానసభ అధ్యక్షుడు కేవీ రావు, కళాపోషకుడు గుది వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ వలిపే

(ప్రథమ)

ఎదురీత

జీవిత కడలిలో కాలపు అలలు
ముందుకు సాగుతు తీరంవైపే
పరుగెడితేనే గమ్యం చేరి
శాంతికి శ్రీకారం చుదుతుంది.
ఎకసెకలు ఎక్కువై
ఎదురీగుతానంటే ఏముంది..?
సుడిగాలి తాకిడికి
చిత్తైపోయి చెదిరి పోవలసిందే.
సమాజపు కట్టుబాట్లకు
తూట్లుపొడుస్తు విలువలను
తుడిచిపెట్టే పనిలో పథకాలువేస్తు
కాలాన్ని కళ్ళంచేసుకొని
బతుకు బండిని నడపాలనిచూస్తే
అతుకలేని ముక్కలౌతుంది జీవితం.
కరెన్సీ కాలంలో కరిగిపోతు
బ్యాంకు బాలెన్స్ పెంచుకుంటు
బతుకు బ్యాలెన్స్ పట్టుతప్పుచు
అర్థరాత్రి విందులు
నిదురలేనిరోజులతో
ఇంటివంట ఇకారమంటు
పార